KSR02B106 c

సినీ మాలతి

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 31, 2016

కథా నిలయం
E
శ్రీకాకుళం



సాగర తీరంలో... సాహస విన్యాసాలు

డిగ్రీలు లేకపోతేనేం...



కరీనా

చదువుకు, ప్రతిభకు సంబంధం లేదని నిరూపిస్తున్నారు బాలీవుడ్ తారలు. తమ అందానికి అభినయాన్ని జత చేసి ఇటు ప్రేక్షకులను, అటు విమర్శకులను ఆకట్టుకుంటూ. అంతర్జాతీయ గుర్తింపును అందిపుచ్చుకుంటున్నారు. అలాంటివారిలో పిగ్గీ చోప్స్, ఐష్, దీపి, బెబో, లోలో పేర్లను ప్రధానంగా చెప్పకోవచ్చు. కపూర్ ఖాందాన్ నుంచి వచ్చి బాలీవుడ్‌లో మెరుపులు మెరిపించిన తారగా కరిష్మాకపూర్‌కు చక్కటి గుర్తింపు వుంది. తొంబైల్లో మంచి డిమాండ్ వున్న తారగా అత్యధిక పారితోషికం అందుకుంది. అయితే తనకు పదహారేళ్ల వయసులో 'ప్రేమ్ ఖైదీ' చిత్రంలో నటించేందుకు స్కూలు చదువుకు బైబై చెప్పేసింది లోలో. అందాల రాణిగా విశ్వ వేదికలపై రాణించిన ప్రియాంక చోప్రా ఇండియా, అమెరికాల్లోని పలు చోట్ల చదువుకుంది. అయితేనేం గ్రాడ్యుయేషన్ మాత్రం పూర్తి చేయలేకపోయింది పిగ్గీ చోప్స్. 'యే దివానీ హై దీవానీ'లో కాలేజీ అమ్మాయిగా నటించిన నెంబర్ 1 తార దీపికా పదుకొనే... నిజజీవితంలో గ్రాడ్యుయేషన్ చేయలేకపోయింది. బెంగళూరులోని మౌంట్ కార్మెల్ కాలేజీలో... ఆ తర్వాత ఇగ్నూలో చిన్నపాటి కోర్సులో చేరినా... ఏదీ పూర్తి కాలేదు. ప్రపంచ అందగత్తెగా గుర్తింపు పొందిన ఐష్ సైతం కాలేజీ డ్రాపవుటే. పైగా ఎప్పుడూ చదువులో పెద్ద చురుకుగా వుండేది కాదు. జైహింద్ కాలేజీలో చేరినా, ఆ తర్వాత ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ సంపాదించేందుకు మరో కాలేజీకి మారింది. అదీ అర్థంతరంగానే ఆగిపోయిందనుకోండి. ఇరవయ్యేళ్లకే బాలీవుడ్‌లో అడుగెట్టి తనకంటూ ఓ క్రేజీను సంపాదించుకున్న నటి కరీనా. మిఠీబాయి కాలేజీలో కామర్స్ చదివాక... న్యాయశాస్త్రం పట్ల ఆకర్షితురాలై గవర్నమెంట్ లా కాలేజీలో చేరినా... పూర్తి చేయలేకపోయింది బెబో. 'అయితేనేం తాము ఎంచుకున్న కెరీర్‌లో దూసుకెళ్తున్నారుగా' అంటారా! ●

ప్రియాంక

కరిష్మా

ఐశ్వర్య

దీపిక

KSR02B106
కథా నిలయం
శ్రీకాకుళం

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కోతల వాతలు

ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ వినిపించే మాట. కనిపించే పదం కోతలు. అది విన్నా... చదివినా... పెదాలు వెనక్కి ముడుచుకుంటాయి. లేదంటే విచ్చుకుంటాయి. నొసలు ముడి పడతాయి. కళ్లు చికిలిస్తాయి. మరి ఆయా సందర్భాన్ని బట్టి కోపం, ఆవేశం, ఆక్రోశం, ఆనందం కలుగుతుంటాయి మనలో.

కొంతమంది లేత సొరకాయలు కోసినట్టు కసకసా కోసేస్తుంటారు. ఇవి మాటల కోతలెండి. సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా వెనకా ముందూ ఆలోచించకుండా కోసే కోతలు ఇవి. ఎదుటివారికి విసుగు రావాల్సిందే కానీ... కోతలరాయుళ్లకి మాత్రం అలుపుండదు.

తెల్సుగా...కోతలు కోయడానికి కొందరికి అనుమతి వుంటుంది. వారెవరంటే సెన్సార్ బోర్డు సభ్యులు. ఒక సినిమా చెత్తగా వుంటే కోత కోసి నీట్‌గా ప్రేక్షకులకు అందించాల్సిన బాధ్యత వాళ్లది. ఒక్కోసారి వారి కత్తెరకు పని పెట్టకపోవడంతో బండబారిపోతుంది. అలాగని దానికి పని ఎక్కువైనా ప్రమాదమే. కోత పెట్టాల్సిన పరిధిని దాటిపోయి డామేజ్ చేసేస్తుంది. ప్రభుత్వాలు మారినప్పుడు, సహజంగానే... సెన్సార్ బోర్డు సభ్యులనూ మార్చుతుంటారు. వారు తమకు, తమ భావజాలానికి అనుకూలమైన వారైవుంటారు. అందుకు తగ్గట్టుగానే వారి కోతలు వుంటుంటాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి జరిగితే ఊరుకోరుగా. కోతలకు నిరసనగా జ్వాలలు రగులుతుంటాయి.

కొందరు పెట్టే కోతలు వల్ల నొప్పి, బాధ కలుగుతుంది. కానీ అవి మన మంచి కోసమే. ఆ కోతలు పెట్టేవారే వైద్య శిఖామణులు. అయితే వీరి కోతలు చాలా కచ్చితంగా వుండాలి. ఆచితూచి ఎక్కడ ఎంత అవసరమో అంతవరకే కోత పెట్టాలి. లేకుంటే ప్రాణాలకే ముప్పు. అయితే ఇటీవల అవసరం లేకపోయినా కోతలు కోసే వాణిజ్య వైద్య శిఖామణులు పెరిగిపోతున్నారు. అదే ఆందోళన కలిగించే విషయం.

వీరు కోసే కోతల కోసం యావత్ ప్రపంచమే ఎదురుచూస్తుంది. వారెవరో కాదు. రైతులు. ఎప్పుడు కోత కోస్తారా ... పంట చేతికెప్పుడొస్తుందా... అని ఆవురావురు మంటుంటాం. మరి ఆత్మారాముడిని శాంతింపచేసే కోతలు కదా అవి.

అబ్బ... వీళ్ల కోతలు వినీ వినీ జనం విసుగెత్తిపోయారు. ఎన్నికల ముందు వీళ్లు కోసే కోతలకి హద్దే వుండదు. అది చేస్తాం ఇది చేస్తాం అంటూ కోసేస్తారు. ఎన్నికల తర్వాతా కోస్తారెండి. కాకపోతే ఈ కోతల వాతలు మన వీపుల మీద తేలుతుంటాయి. ముందుగా సంక్షేమ పథకాల్లో కోత పెట్టేస్తారు. ఖర్చుల్లో కోత వేసేస్తారు. అయినా ఇదని అదని ఏముంది! కరెంటు కోత, నీళ్ల కోత, రేషన్ కోత, ఉద్యోగాల కోత, కాలేజీల్లో సీట్ల కోత...! కోతలే కోతలు! వాతలే వాతలు!

ఈ కోతల ప్రభావంతో మన ఇళ్లల్లోనూ కోతలు పడుతుంటాయి. పెరిగిన ధరల కారణంగా కుటుంబంలో కోతల పరంపర మొదలౌతుంది. ఇష్టమున్నా లేకున్నా అన్నీ భరించేయాల్సిందే. మరి ఆఫ్టాల్ ఓటర్లం కదా. ■



◆ మనలో మాట



టపా

ఆదర్శనీయం

ఒడిషాలోని జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్ వాసులు తమ ప్రాంత అభివృద్ధి కోసం చేస్తున్న సేవ ప్రశంసనీయం. మహిళల్లో చైతన్యం తీసుకురావడం అనే అంశాన్ని 'విశేషం'లో బాగా వివరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలల్లో పేదరికం ఒక జఠిలమైన సమస్యగా అగుపిస్తుంది. రాబోవు తరాలు ఆకలి మంటలకు బలి కావాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు ఏనాడో హెచ్చరించారు. దీనికి ప్రత్యామ్నాయంగా నీలి విప్లవం తీసుకురావడం నిజంగా ఆనందం. పేదలు కూడా ఆర్థికంగా ఎదగడానికి, ఆహార సమస్యలు తీర్చడానికి ఇది ఒక ప్రత్యామ్నాయంగా చెప్పుకోవచ్చు. వ్యవసాయం, పాడి పంటలు అభివృద్ధి మీద మరిన్ని అంశాలు ఇస్తారని ఆశిస్తున్నాను.

శివ, ముద్దనూరు, కడప

3డి మాయ

త్రీడి మాయాలోకంలో ఏదైనా సహ జంగా అగుపిస్తుంటాయి అనేది వాస్తవం. అయితే మన అవయవాల మార్పు కూడా సహజ సిద్ధంగా ఉంటాయంటున్నారు శాస్త్రవేత్తలు. వైద్య విభాగంలో ఇది ఒక నూతన అధ్యాయంగా చెప్పుకోవచ్చు. అబ్బుర పరిచిన ఆలయాల్లో శ్వేత బౌద్ధాలయం ఒకటి. ఎటు చూసినా బౌద్ధ క్షేత్రాలు, ధ్యాన మందిరాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. థాయ్‌లాండ్ టూరిజం స్పాట్‌గా ఈ బౌద్ధాలయాలను చెప్పుకోవచ్చు.

రమణ, అనంతపురం

స్ఫూర్తిదాయకం

ఎక్కడో పుట్టి ఇక్కడే కలిశాం అంటున్నారు బాలీవుడ్ తారలు. తమ అందం, నటనతో తమ సత్తాను చాటుతూ సినీ ఇండస్ట్రీలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న తారలు ముందు ముందు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశిస్తున్నాను. బాడీ బిల్డర్ బార్బీ తన చిన్నతనంలో చేతులు కోల్పోయినా ఎంతో పట్టుదలతో బాడీ బిల్డింగ్, నృత్యం నేర్చుకుంది. స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేస్తూ తనలాంటి వారిలో ఉత్తేజాన్ని కల్గిస్తున్న బార్బీ అభినందనీయురాలు.

సుధాకర్ రెడ్డి, కొమ్మలూరు, కడప

మార్పు కలిగేలా...

మహిళలంటే చులకన భావం అక్కడక్కడా ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. అలాంటి అపోహలున్న వారికి ఒడిషా జగన్నాథ్ బ్లాక్ మహిళల విజిలే సమాధానంగా నిలుస్తుంది. కుటుంబాన్నే గాక తమ పరిసర ప్రాంతాలూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలనే వీరి విజిల్ ఆలోచన అద్భుతంగా వుంది. ఈ వారం అందించిన సూర్యకాంతం విశేషాలు, దర్పానికి ప్రతీకలుగా మారిన పంజాబీ ట్యాంకుల లోతైన రహస్యాలు, శ్వేత బౌద్ధాలయం వివరాలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

శ్రీనివాసరావు, ఏలూరు

అద్భుత వైద్యం

3డి అనగానే ప్రత్యేకమైన కళ్ళద్దాలతో సినిమా హాల్లో తెరపై పెద్ద పెద్ద జంతువులు మన మీదకొచ్చిపడిన అనుభూతి పొందాం. ఈ వారం స్నేహలో ఇచ్చిన 3డి అవయవాల విశేషాల ద్వారా సినిమాలల్లో కాకుండా వైద్యంలోనూ వీటిని ఉపయోగించి అవయవాలను తయారు చేస్తారని తెలుసుకోగలిగాం. ద్వీప కల్పనలో దీవుల గురించి అందించిన వివరాలు ఆశ్చర్యానికి గురిచేశాయి.

పద్మ ప్రియ, తెనాలి

సవరణ

గత వారం స్నేహ అట్టమీద రాజసులోచన ఫొటోకి బదులుగా బి.సరోజాదేవి ఫొటో వచ్చింది. పొరపాటుకు చింతిస్తున్నాం.

-ఎడిటర్

ఈ సంచికలో....

సాగర తీరంలో... సాహస విన్యాసాలు

కవర్ స్టోరీ — 6

విశాఖ తీరం ఒక అద్భుత సమర సమ్మేళనానికి వేదిక కాబోతోంది. ప్రపంచస్థాయి ప్రతిభా పాటవ ప్రదర్శనకు ఆతిథ్యం ఇస్తోంది. ఫిబ్రవరి 4 నుంచి 9 వరకూ ఈ ఉక్కు నగరంలో ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) జరగనుంది. అందుకే- ప్రపంచం యావత్తూ తూర్పు తీరం.. విశాఖ వైపే చూస్తోంది. ఇది భారత నౌకాదళ చరిత్రలో అత్యంత అరుదైన ఘట్టం.

స్ఫూర్తి 3
'పాములతో దోస్తీ చేస్తా'

తెలుసా 4

కార్టూన్ పంచ్ 5

చూద్దామా 10
హిమ సీమల్లో కాశ్మీరం

సినిమా కబుర్లు 14
సినీ 'మాలపిల్ల'

వింతలోకం 16
వైద్యుడు చెక్కిన శిల్పం

కవిత్వమ్ 17
నేను హత్య చేశాను

కథ 18
మహిళా చైతన్యం

రుచి 21
సగ్గు బియ్యం లాలీపిట్

బాల నేస్తాలు 22
పట్టుకోండి చూద్దాం !

కొత్త పుస్తకాలు 24
హేలావతి

స్టార్స్ -12
సూపర్ సిస్టర్స్

సాధారణంగా పాముల్ని చూస్తే ఎవరికైనా భయమే. వాటి కదలికల్ని దగ్గర్నుంచి చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. బుసలు దగ్గర్నుంచి వింటే దూరంగా పారిపోతాం. పడగలు చూసి హడలెత్తుతాం. కానీ ఆమె మాత్రం పాములను చూస్తే ఎగిరి గంతేస్తుంది. మురిపెంగా వాటితో మాట్లాడుతుంది. ఒక్క పాములనే కాదు. పశుపక్ష్యాదులూ ఆమె చుట్టాలే.

'పాములతో దోస్తీ చేస్తా'

ఆమే గార్గి. ఏ ఫర్ యాపిల్, బీ ఫర్ బ్యాట్ అని చదవాల్సిన వయస్సులో ఏ ఫర్ యానిమల్స్, బీ ఫర్ బర్డ్స్ అని నేర్పించాడామె తండ్రి. మరి అలాంటి జంతు ప్రేమికుడి కూతురు ఇలా వుండడంలో ఆశ్చర్యపడాల్సిందేముంది. ఆమె చిన్నప్పుడు గదిలోకి ఓ పాము వచ్చింది. గార్గి తండ్రి దాన్ని మెల్లగా బయటకు నెట్టేశాడు. కానీ, ఈ లోగా చిన్నారి గార్గి ఏడుపు మొదలెట్టింది. భయం వేసిందనుకుని ఆమె తండ్రి ఓదారుస్తున్నాడు. కానీ, అసలు విషయం తెలిస్తే ఆశ్చర్యపోతారు. తన గదిలోకి వచ్చిన పాముతో ఆడుకునే అవకాశం ఇవ్వలేదని, బయటకు పంపేశారని అలిగి ఏడ్చిందట! ఈ ఒక్క ఉదాహరణ చాలు. గార్గి గురించి చెప్పడానికి. ఆరోజే ఆమెకు పామును పెంచుకోవాలనిపించిందట.

గార్గి విజయ రాఘవన్ పెరిగింది ముంబయి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ కాలనీలో. అది ముంబయి శివార్లలో వుంటుంది. సిటీకి భిన్నంగా అంటే, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా చెట్లు, పుట్టలు, పక్షులతో చిన్నపాటి అడవిలా వుండే ప్రాంతం. అలాంటి చోట అడపా దడపా పాములూ కనిపిస్తూనే వుంటాయి. వాటిని చూడగానే అందరూ భయపడి దూరంగా పోతుంటే... మూడేళ్లకే గార్గి వాటి దగ్గరగా వెళ్లి పట్టుకోవడం మొదలుపెట్టింది.

"ముంబయి బార్క్ కాలనీలో పాములు చాలా ఎక్కువగా వుండేవి. అక్కడ ఇళ్లలో, షాపుల్లో దూరటం చాలా కామన్. ఓ రోజు నేను, నాన్న కలిసి కాలనీలో వెళ్తున్నాం. అకస్మాత్తుగా ఓ దగ్గర అరుపులు, గోల వినిపించాయి. తీరా వెళ్లి చూస్తే ఏముంది? ఓ పాము షాప్‌లోకి దూరింది. మేం ఇద్దరం కలిసి దాన్ని మెల్లగా తీసి బయట వదలేశాం. పాములంటే నాకున్న ఇష్టం తెలిసిన మా నాన్న నన్నూ ఓ చేత్తో పట్టుకోనిచ్చాడు. అదిగో అప్పటి నుంచి పాము కనిపిస్తే చాలు మాకు పిలుపొచ్చేది. చివరికి ఎలా అయిందంటే మా కాలనీ వాళ్ల దగ్గర్నుంచి... ఏరియాలోని ఫైర్ డిపార్ట్‌మెంట్ వరకు పాము కనిపిస్తే చాలు మమ్మల్నే పిలుస్తారు..." అని సర్పాలతో తన తొలి ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటుంది గార్గి.

అలా గార్గి చిన్నతనం నుంచి పాములంటే ప్రేమ చూపేది. ఉత్సాహంగా పట్టుకునేది. కానీ, పాములతో వున్న ప్రమాదం ఆమె తండ్రికి తెలియంది కాదు. అందుకే తన కూతురు పాములకు దగ్గరగా వెళ్లడంపై కొంత జంకేవాడు. ఆమెకంత శక్తి వుందా అనే సందేహం వ్యక్తం చేసేవాడు. ఆ రోజు కాలనీలో పామును పట్టే దగ్గర హెల్ప్ చేసినప్పటికీ అన్ని రకాల పాముల గురించి తెలిసే వారకు వాటికి దగ్గరగా వెళ్లడానికి వీల్లేదని ఆమె తండ్రి తేల్చి చెప్పేశాడు. అప్పటికామె వయసు 13.

పాములపై వున్న ఆసక్తితో ఒక్క ఎండా కాలంలోనే ఆమె వివిధ రకాల సర్పజాతులు, వాటి లక్షణాలు, ఇతర గుణగణాలు అన్నీ అధ్యయనం చేసింది. వాటి పట్ల ఆమెకున్న ఇష్టంతో తండ్రిని ఒప్పించింది. మొదట విష రహిత పాములతో మొదలైన ఆ పయనం... మెల్లగా విషపూరిత పాముల వరకు చేరింది.

'అంతరించి పోతున్న జీవుల్లో చాలా రకాల సర్ప జాతులున్నాయి. పాములకు మనిషే పెద్ద శత్రువు' అంటుందామె. వాటి పట్ల మనం చూప నిర్లక్ష్యం వాటిని అంతం చేస్తోందని చెప్తోంది. అందుకే పాములను గురించిన అవగాహన ప్రజల్లో కల్పించే ప్రయత్నం చేస్తోంది. నిజానికి భారతదేశంలో విషపూరిత సర్పాలు కేవలం నాలుగు రకాలు మాత్రమే. మిగిలినవన్నీ ఏ రకమైన హానీ చేయనివే. ఈ క్రమంలో కేవలం ఇళ్లలో దూరిన పాములను మాత్రమే ఆమె జాగ్రత్తగా పట్టి దూరంగా వదలడం మొదలెట్టింది. బయట కనిపించే పాముల జోలికి పోకుండా అక్కడి వారిని ఒప్పిస్తోంది. పాము దాని పుట్టలో అది వుంటే మనకొచ్చిన నష్టం ఏంటి? దాని ఇంటి నుంచి దాన్ని బయటికి వెళ్లగొట్టే పని నేను మాత్రం చేయనని కరాఖండిగా చెప్తోందిప్పుడు.

పాములతో పయనంలో ఇప్పటికి ఆమెకు దాదాపు పదేళ్ల అనుభవం వచ్చేసింది. నేటి వరకు ఆమె తన తండ్రితో కలిసి 2 వేల పాముల్ని కాపాడివుంటుంది. ఇన్ని సందర్భాల్లో ఎక్కడా ఏ ప్రమాదం జరగలేదు. అంత జాగ్రత్తగా వ్యవహరించడం ఆమెకు అలవాటైంది. కానీ, ఇంత ప్రతిభ చూపుతున్నా ఆమెను విచిత్రంగా చూసేవాళ్లో లేక, ఒక అమ్మాయేంటి పాములు పట్టడమేంటి అని తేలిగ్గా మాట్లాడే వాళ్లో తారసపడుతుంటారు. నిజానికి స్కూల్లో చదువుకునే రోజుల్లోనూ ఏడ్పించడం, ఆమె ముందు పాములాగా బుస్‌మని శబ్దాలు చేస్తూ ఏడ్పించడం జరుగుతూ వుండేది. కానీ, ఇలాంటివి జరిగిన ఇప్పుడు గార్గి అనేక పాఠశాలల్లో, విద్యా సంస్థల్లో పాములు, ఇతర జంతువులతో కలసి బతకడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించేలా గెస్ట్ స్పీచ్‌లు ఇస్తోంది. ప్రముఖుల చేతుల మీదుగా పలు అవార్డులు అందుకుంది. ముంబయి రాజ్‌భవన్‌లో అరుదైన 17 నెమళ్లను సంరక్షిస్తూ కనిపిస్తోంది. ప్రకృతితో, సమస్త జంతువులతో కలిసి బతకడంలో వున్న ఆనదం ఏంటో గార్గిని చూస్తే అర్థమవుతుంది.

✦

తెలుసా!

చెట్లపై గూళ్ళలో పెరిగే చిన్న పక్షి పిల్లలకు రెక్కలుండవు. వీటికి కళ్ళు కనపడవు. ఎగరడానికి సంసిద్ధమయ్యేదాకా తల్లితండ్రి పక్షులే వీటి నోటికి ఆహారాన్ని అందిస్తాయి. వాటిని వెచ్చగా వుంచుతాయి.

కెవిన్ పక్షి ప్రధానంగా ధాన్యాలను తింటుంది.

నీటి కొంగలు కాళ్ళలో ఉండే రక్తనాళాలను బిగబట్టి గడ్డకట్టించేంత చల్లటి నీటిలోను గంటలసేపు నిలబడిపోతాయి.



నేల మీద గూళ్ళలో పెరిగే పక్షి పిల్లలు పుట్టిన కొద్ది రోజులకే అవి అటు ఇటు పరుగెత్తగలవు. తమ ఆహారాన్ని సంపాదించుకోగలవు. కొన్ని పక్షి పిల్లలు ఈదగలవు కూడా. వీటి కడుపు దగ్గర మెత్తటి ఈకలు వుంటాయి.

క్రాస్ బిల్ ఎండిన పైన్ పళ్ళ విత్తనాలను పొడుచుకు తింటుంది.

అతి చిన్న పక్షి అయిన 'హమింగ్ బర్డ్' తన రెక్కలను అత్యంత వేగంతో ఆడించి గాలిలో అలా ఒకే చోట స్థిరంగా నిలిచిపోగలదు. వెనక్కి ఎగరగలదు కూడా. ఎగిరేటప్పుడు తన దారి మళ్ళించుకొనేందుకు తన రెక్కల ఆకారాన్ని కోణాల్ని మార్చుకోగలదు. రెక్కలతో వేగాన్ని అదుపు చేసుకుని నేలమీద ఆగడం వంటివి చేయగలదు.

బొహేమియన్ వాక్స్‌వింగ్ పక్షి చిన్న ముక్కు, పెద్ద కళ్ళు కలిగి ఉంటుంది. పిల్లలకు తగినంత ఆహారం లేనప్పుడే బయటికి వెళుతుంది. బెర్రీలు, వడగళ్ళను మింగేస్తుంటుంది.



బోట్ బిల్ హెరాన్ పక్షి ముక్కు నీలిరంగులో చూడ్డానికి చిన్న పడవలా ఉంటుంది. పొట్ట, కాళ్ళు, గోధుమ రంగులో రెక్కలు నీలి, నలుపు, బూడిదరంగులో ఉంటాయి.

కింగ్ ఫిషర్ పక్షి తన రెక్కలను ముడుచుకుని నేరుగా నీటిలోకి చొచ్చుకుపోతుంది. తన సూదైన, పదునైన ముక్కును చేపలకు గుచ్చి వాటిని పట్టుకుంటుంది. అనేక నీటి పక్షులు నీటి ఉపరితలం మీద పరుగెట్టి ఎగిరేందుకు వేగాన్ని పుంజుకుంటాయి.


కులమత అసహనం
సరిగ్గా యూనివర్శిటీ మధ్యలో పడాలి!!
గంగాధర్

నా... రాజ్యంలో ధర్నాలు చేస్తారా తప్పమ్మా!!
ఆశావర్కర్లు అంగన్ వాడీలు
ఆరోగ్యమిత్ర


మహావృక్షంగా పెంచాలి సరేనా?!
?!
అంకుర్ భారత్ ప్రారంభం
గంగాధర్


అభివృద్ధికి అడ్డొస్తున్నావేమయ్యా? మర్యాదగా తప్పుకో!!
?!
రాజధాని ప్రాంతంలో..

కార్టూన్ పంచ్

విశాఖ తీరం ఒక అద్భుత సమర సమ్మేళనానికి వేదిక కాబోతోంది. ప్రపంచస్థాయి ప్రతిభా పాటవ ప్రదర్శనకు ఆతిథ్యం ఇస్తోంది. ఫిబ్రవరి 4 నుంచి 9 వరకూ ఈ ఉక్కు నగరంలో ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) జరగనుంది. అందుకే- ప్రపంచం యావత్తూ దేశ తూర్పు తీరం.. విశాఖ వైపే చూస్తోంది. ఇది భారత నౌకాదళ చరిత్రలో అత్యంత అరుదైన ఘట్టం.

సాగర తీరంలో...
సాహస విన్యాసాలు

- ఎన్ మధుసూదనరావు

భారత తూర్పు తీరంలో తొలిసారిగా జరగనున్న అంతర్జాతీయ యుద్ధనౌకల విన్యాసాల (ఐఎఫ్ఆర్) ప్రదర్శనకు ఇప్పటికే 52 దేశాల నుంచి యుద్ధ నౌకలు వచ్చాయి. మరో 30 దేశాలకు చెందిన నావికాదళాధికారులూ వచ్చారు. ఈ సందర్భంగా విశాఖ నగరం సరికొత్త సొబగులు అద్దుకొంది. కోట్ల రూపాయలతో విశాఖ నగరంలోని టూరిస్టు ప్రదేశాలు, ఎయిర్‌పోర్టు, పోర్టు, వుడా పార్కు, ఆర్‌కె బీచ్‌లో జరిగిన సుందరీకరణ పనులు అందరి హృదయాలను కట్టిపడేస్తున్నాయి. సాగర తీరం ఆనంద సాగరంగా మారిపోయింది. ప్రపంచం అంతా కలిసి ఒకచోటకు చేరితే కలిగే అనుభూతి ఎలా ఉంటుందో.. దేశ, విదేశాల్లో కూడా లక్షల, కోట్ల గుండె చప్పుడంతా ఐఎఫ్ఆర్‌గా మారిందంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకి సంబంధించిన రిహార్సల్స్ జనవరి 27 నుంచి ఆర్‌కేబీచ్‌లో ప్రారంభం అయ్యాయి. ఫిబ్రవరి 4వ తేదీ వరకూ జరగనున్నాయి. ఫిబ్రవరి 5న భారత రాష్ట్రపతి, దేశ సర్వ సైన్యాధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్రమోడీ విశాఖ రానున్నారు. 7వ తేదీ వరకూ వీరిద్దరూ విశాఖలో యుద్ధనౌకల సమీక్షలో పాల్గొంటారు. 4వ తేదీ మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం ఆర్‌కె బీచ్‌లో 'విక్టరీ ఎట్ సీ' (1971 భారత్-పాక్ మధ్య సముద్రంపై జరిగిన యుద్ధంలో విజయానికి గుర్తుగా ఏర్పాటు చేశారు) వద్ద అమరులకు స్మృత్యంజలి ఘటిస్తారు. తరువాత లక్షలాదిమంది జన సందోహం మధ్య ఫ్లీట్ రివ్యూను ప్రారంభిస్తారు.

ఫ్లీట్ రివ్యూ విశేషాలు

మన నౌకాదళ శక్తి, సామర్థ్యం, ఆయుధ బలంతో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సాగరంలో ఎదురుదాడికి దిగగల సత్తా చాటేందుకే ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకూ దేశీయంగా 12 ఫ్లీట్ రివ్యూలు జరిగాయి. రాష్ట్రపతి

తప్పనిసరిగా ఈ రివ్యూలో పాల్గొంటారు. 2006లో తూర్పు నౌకాదళంలో కూడా ఒకసారి ఈ ప్రెసిడెంట్ రివ్యూ ఫ్లీట్ జరిగింది. తాజాగా జరుగుతున్నది ప్రపంచ స్థాయి రివ్యూ. యుద్ధనౌకలు, యుద్ధ విమానాలు (జెట్ ఫైటర్లు), సబ్ మెరైన్ (జలాంతర్గాములు) అద్భుత విన్యాసాలతో అబ్బురపరచనున్నాయి. ఈ తరహా అంతర్జాతీయ స్థాయి ఫ్లీట్ 15 ఏళ్ల క్రితం 2001లో ముంబైలో (పశ్చిమ తీరాన) జరిగింది. అప్పట్లో 29 దేశాలు పాల్గొన్నాయి. ఇప్పుడు 52 దేశాల వరకూ పాల్గొంటున్నాయి.

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూల ద్వారా విదేశీ యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, జలాంతర్గాముల శక్తి సామర్థ్యాలను, సాంకేతికతను, నేవీ నైపుణ్యతను తెలుసుకునే వీలుంటుంది. నీటిపై యుద్ధం జరిగే సమయంలో కీలకపాత్ర పోషించాల్సింది ఈ యుద్ధనౌకలే. భారీ ఆయుధాలను, విమానాలను మోసుకెళ్లాల్సింది కూడా ఇవే! సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారా విదేశాలతో సత్సంబంధాలకు ఈ ఫ్లీట్ రివ్యూ దోహదపడుతుందని అంటారు. మామూలు సమయంలో ఎంతో ప్రశాంతంగా కనిపించే నౌకలు యుద్ధం వచ్చేసరికి తన గర్భంలో దాచుకున్న చంద్ర నిప్పులు చెరుగుతాయి. భయంకర ఆయుధాలను ఒక్కసారిగా కుమ్మరిస్తాయి. మన సాంకేతిక ప్రాభవం, దేశ సాంస్కృతిక, సాంప్రదాయక, ఆచార వ్యవహారాలను ఇతర దేశాలకు తెలపాలన్నా సరే ఈ 'మారిటైం ఎక్సర్‌సైజెస్, సమీక్షలు' అవసరమని భారత నౌకాదళం గట్టిగా నమ్ముతోంది.

ఆకర్షించే ఆపరేషన్స్

ఫిబ్రవరి 4 నుంచి 9 వరకూ జరిగే ఫ్లీట్ రివ్యూలో మేరిటైం ఎగ్జిబిషన్ అంటే మన దేశ ప్రతిష్ఠ, చరిత్ర, సంస్కృతి, శాస్త్రీయ నిబద్ధత, వారసత్వానికి సంబంధించిన అనేక అంశాలు విదేశీ త్రివిధ దళాలకు తెలిసే ఆస్కారముంది. ఈ ఎగ్జిబిషన్ విశాఖ ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో ఆహ్లాదకరంగా ఏర్పాటు చేశారు. దేశ ప్రధాని పాల్గొనేందుకు 'మేరిటైం కాన్ఫరెన్సు' ఒకటి ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో ఏర్పాటు చేస్తున్నారు.

అంతర్జాతీయంగా ఆకర్షించే మరో అంశం.. ఆపరేషనల్ డెమాన్‌స్ట్రేషన్.. విశాఖ బీచ్ తీరాన కన్నుల పండువగా, వీనుల విందుగా జరగనుంది. వివిధ దేశాలకు చెందిన యుద్ధనౌకలు దీంట్లో పాల్గొననున్నాయి. వివిధ దేశాల నుంచి వచ్చే నేవీల బ్యాండ్‌లు రోడ్డుపై ఓ వైపు సంగీతం (సిటీ పరేడ్)ను అందిస్తుండగా మరో వైపు కాంటినెంటల్ పరేడ్ 1500 మంది విదేశీ నేవీ సిబ్బందితో సూర్యాస్తమయ సమయంలో ప్రతి రోజూ సాయంత్రం జరగనుంది. ఇది జరుగుతుండగా పైనుంచి యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతుంటాయి.. యుద్ధ నౌకలు సముద్రంలో విన్యాసాలు చేస్తూ ఉంటాయి. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే నావికాదళ అధికారుల కోసం విశాఖ నగరం, చుట్టు పక్కల ప్రదేశాలను సైతం అందంగా తీర్చిదిద్దారు.



కీలకం త్రివిధాలే

నేల, నీరు, ఆకాశం మూడూ ముఖ్యమే. త్రి విధాలుగా సన్నద్ధమయ్యేందుకు, శక్తి, యుక్తులను చాటేందుకు భారత్ సన్నద్ధమైంది. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందు బాటులోకి వచ్చాక శత్రువును ఎదుర్కోవడం కంటే వారి దాడిని ముందుగానే పసిగట్ట గలగడం కీలకం. ఈ నేపథ్యంలో నేల, గాలిలో కంటే నీటిలో యుద్ధం అతి కష్టమైనది. ప్రమాదకరం. కంటికి కనిపించకుండా ఏ దిశ నుంచైనా శత్రువు దాడి చేయొచ్చు. ఈ పరిస్థితుల్లో సైనికులకు కీలక ఆధారం యుద్ధ నౌకలే. సముద్రపు లోతుల్లోంచి గగన తలంలోకి గురిపెట్టే సత్తా సాధించగలగాలి. ఏ దేశ రక్షణలోనైనా యుద్ధనౌకలు, జలాంతర్గాములు కీలక భూమిక పోషిస్తాయి. వార్ షిప్స్‌లో కీలక పాత్ర పోషించే అస్త్రధారణి, సహ్యాద్రి, ఐఎన్ఎస్ విక్రాంత్, రాజ్‌పుత్, ఐఎన్ఎస్ గోదావరి, తల్వార్, చైనా తరహా నౌక విక్రమాదిత్య ముఖ్యంగా భారత నౌకాదళం అమ్ములపొదిలో ఉన్నాయి. పలురకాలుగా యుద్ధ సన్నాహాల్లో ఇప్పటికే తరచూ పరీక్షింపబడిన వీటిని తూర్పు నౌకాదళం ఈ విన్యాసాల్లో భాగస్వామ్యం చేయనుంది. భారత నౌకాదళం వద్ద ప్రస్తుతం 135 యుద్ధనౌకలు, పలు సబ్‌మెరైన్స్ ఉన్నాయి. ఒక అణు జలాంతర్గామి కూడా ఉంది. విమాన వాహక నౌకలు అందు బాటులో ఉన్నాయి. ఇవి గాకుండా మరో 45 ఆధునాతన యుద్ధనౌకల నిర్మాణం కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయి. విశాఖ కేంద్రంగా నూతన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా త్వరలో కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలున్నాయి.

భారత నౌకాదళ అధికార్లు వీరే ...

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డిఏ)లో శిక్షణ పొందిన సతీష్‌సోనీ 1976 బ్యాచ్, నేవీలో పలుస్థాయిలో విధులు నిర్వర్తించి ప్రస్తుతం వైస్ అడ్మిరల్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా ఉన్నారు. రియర్ అడ్మిరల్, ఫ్లాగ్ ఆఫీసర్‌గా వీఎస్ బొకారే, వైస్ అడ్మిరల్‌గా బిమల్ వర్మ (చీఫ్ ఆఫ్ స్టాఫ్), రియర్ అడ్మిరల్ సంజయ్ మహీంద్ర (ఫ్లాగ్ ఆఫీసర్, సబ్‌మెరైన్స్), పాయల్ సోనీ (నావల్ వైవ్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ తూర్పు నౌకాదళం)లో సేవలందిస్తున్నారు.

సతీష్‌సోనీ



ఐఎఫ్ఆర్ విలేజ్‌లో ...

భారత నౌకాదళ ఆయుధ సంపత్తి ప్రదర్శనకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా తయారు చేశారు. త్రివిధ దళాలకు చెందిన ఆయుధ సంపత్తిని కళ్లముందు కదలాడేలాగ ఈ విలేజీని రూపుదిద్దారు. 1000 మంది శ్రామికులు నెలరోజులుగా దీనికోసం కసరత్తు చేశారు. తీరంలో యుద్ధనౌకల విన్యాసాలను ఈ విలేజ్‌లో ఎగ్జిబిషన్‌లో ఉంచడమే గాకుండా యుద్ధనౌకలు, జలాంతర్గాములు, మిసైల్స్, హెలికాప్టర్‌ల నమూనాలను ఇక్కడ ఉంచారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థలు పెవిలియన్స్, అండ్ ఇంటీరియర్స్, ఎక్స్ పో కంపెనీలు ఎగ్జిబిషన్‌కు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. బీచ్‌లో పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ బారికేడ్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వివిధ దేశాలకు చెందిన షిప్‌లు షిప్పింగ్ హార్బర్‌లో ఉన్నాయి. 2వ తేదీ నాటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి నౌకాదళం అధికారుల అధీనంలోకి నిర్దేశిత ప్రాంతం వెళ్లనుంది.

చైనా నౌకల రాక

ఆసియా ఖండంలో అగ్రశక్తిగా వెలుగొందుతున్న చైనాకు చెందిన యుద్ధ నౌకలు ఫ్లీట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పాకిస్థాన్, అమెరికా ఈ ప్రదర్శనకు దూరంగా ఉన్నాయి. యూరప్‌కు చెందిన వాణిజ్య నౌకలు ఈ విన్యాసాల్లో అలరించనున్నాయి. చైనా నేటికీ యుద్ధ విమానాలను తరలించే ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్‌ను సమకూర్చుకునే స్థితిలో ఉంది. చైనా యుద్ధనౌకలతో సరితూగగల భారత్ ఐఎన్ఎస్ విక్రమాదిత్య, విరాట్‌లను ప్రదర్శించనుంది. భారత్‌కు చెందిన యుద్ధ నౌకలు (నేవల్ ఫైటింగ్ షిప్స్) 70 నుంచి 80 వరకూ ఈ ఫ్లీట్‌లో పాల్గొంటున్నాయి. గాలిలో నుంచే సముద్రంలోని శత్రుదేశాల యుద్ధ నౌకల్ని నిర్దేశిత లక్ష్యాలతో పేల్చేసే నైపుణ్యాల్ని ఇవి ప్రదర్శిస్తాయి. ఎనిమిది వేల టన్నుల బరువు కలిగిన 'ఆక్యులా' తరహా న్యూక్లియర్ పవర్డ్ జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్ర హఠాత్తుగా సముద్ర గర్భంలోంచి పైకి వస్తూ భయోత్పాతాన్ని సృష్టించగలిగే ఆపరేషన్ కూడా ప్రదర్శిస్తారు. సముద్రంలో ఇలా విన్యాసాలతో ఆనంద పర్యంతం చేసే యుద్ధనౌకలు ఓ పక్క ప్రదర్శనలిస్తుంటే మరో పక్క ఇండియన్ నేవల్ కమాండ్‌కు చెందిన 45 యుద్ధ విమానాలు గగనతలంలోకి దూసుకుపోతుంటాయి.

తూర్పు తీరానే ఎందుకు?

నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ (త్రివిధ దళాల)కు భౌగోళికంగా కీలక కేంద్రంగా తూర్పు తీరం ఉంది. సహజసిద్ధమైన రక్షణ గోడల్లా కొండలు విశాఖకు సొంతం. రాంబిల్లిలో అణు జలాంతర్గాముల నిర్మాణం కూడా త్వరలో ప్రారంభం కానుండడానికి కారణం ఇదే. ఎన్ఎస్‌టిఎల్ దేశీయ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో షిప్‌ల తయారీ కూడా తూర్పు తీరాన బలమైన అంశం. దేశంలో 13 ప్రధాన పోర్టుల్లో 7 తూర్పు తీరంలో ఉన్నాయి. విశాఖలో 1939లో చిన్న బోట్ పోస్ట్‌గా తూర్పు నౌకాదళం ఏర్పాటైంది. 2005 వరకూ 28 యుద్ధనౌకలు మాత్రమే కలిగి ఉంది. ప్రస్తుతం 70కి పైగా ఉన్నాయి. విశాఖ నేవల్ బేస్‌లో రెండు న్యూక్లియర్ ఆధారిత జలాంతర్గాములు (న్యూక్లియర్ బేస్డ్ సబ్ మెరైన్స్) ఉన్నాయి. దేశంలోనే అతి పెద్ద కమాండ్‌గా తూర్పు నౌకాదళం నేడు విస్తరించింది. తూర్పు తీరానికి విశాఖ ప్రధాన కేంద్రం కాగా, కోల్‌కత్తాలో బేస్ ఉంది. దేశ భద్రత, సార్వభౌమత్వ పరిరక్షణ ధ్యేయంగా తూర్పునౌకాదళం సామర్థ్యం భారత నౌకాదళంలో నిక్షిప్తమై నడుస్తోంది. ఈస్ట్రన్ నేవల్



కమాండ్ పరిధిలో ఏపి, ఒడిశా, బెంగాల్, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవుల సమూహ తీర ప్రాంతాలు ఉన్నాయి. బేస్‌లు కోల్‌కతా, పారాదీప్, ట్యుటికోరన్, కాకినాడ, చెన్నయ్, అండమాన్‌లో ఉన్నాయి.

నౌకాదళం నిరంతర అప్రమత్తత..!

ఫ్లీట్ రివ్యూకు తూర్పు తీరాన్నే ఎంచుకోవడానికి అతి కీలకమైన భౌగోళిక కారణం ఉంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ... పాక్‌ను శత్రు దేశంగా చెబుతోంది. 1971లో జరిగిన యుద్ధం నుంచీ పాక్‌పైనే గురి భారత్‌కు ఉంది. అప్పట్లో కూడా పాకిస్తాన్ పన్నాగాలను, పాకిస్తాన్ నేవల్ షిప్ ఘాజీ జలాంతర్గామి అక్రమ ప్రవేశాన్ని పసిగట్టి ఐఎన్ఎస్ విక్రాంత్‌తో భారత నౌకాదళం ఎదురుదాడి చేసి ఘాజీని సముద్రంలోనే ముంచేసింది. దీనికి గుర్తుగా

అంతర్జాతీయ కవాతు

ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించి, తద్వారా భారత్ ప్రతిష్టను ఇనుమడింపజేలా ఫిబ్రవరి 7న అంతర్జాతీయ కవాతు నిర్వహించడానికి భారత నౌకాదళ అధికారులు సిద్ధమయ్యారు. దీని కోసం నగరంలోని బీచ్‌రోడ్డులోని 'ఓపెన్ మినీ ఆడిటోరియం'ను రూపొందించారు. దీనికోసం 2 నెలలుగా వందల మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. భారీ స్థాయిలో సెట్టింగులు, రంగు రంగుల సీటింగ్ అరేంజ్‌మెంట్స్‌తో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కవాతు చూసేందుకు 'ఓపెన్ టు పబ్లిక్'.. సుమారు లక్షన్నర మందికి పైగా జనం వచ్చే అవకాశాలున్నాయి. వేలాదిమంది పోలీసు బలగాలు నగరానికి విచ్చేశాయి. ఆక్టోపస్ దళాలు కూడా నగరానికి చేరుకున్నాయి. నగరమంతా విద్యుత్ కాంతులతో వీనుల విందు చేసేలా యంత్రాంగం ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది.



అందరూ ఆహ్వానితులే

జనవరి 27 నుంచి ఆర్‌కెబీచ్‌లో 2016 ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం వరకూ యుద్ధనౌకల విన్యాసాలకు ప్రజానీకానికి ఎలాంటి పాస్‌లు అవసరం లేదు. 'ఓపెన్ టు పబ్లిక్' అంటూ నేవల్ అధికారులు ప్రకటించారు. 4వ తేదీ మధ్యాహ్నం నుంచి నిబంధనలు వర్తిస్తాయి. 4న సాయంత్రం 4.20గంటల ఆర్‌కెబీచ్‌లో మృతవీరులకు గుర్తుగాగల 1971 వార్ మెమోరియల్‌కి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు స్మృత్యంజలి ఘటించడంతో కార్యక్రమం మొదలవుతుంది. సాయంత్రం 5.20 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో 'మేరిటైం ఎగ్జిబిషన్, ఐఎఫ్ఆర్ విలేజ్' ప్రారంభం ఈ కార్యక్రమం కూడా 'ఓపెన్ టు పబ్లిక్'. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు చీఫ్ నేవల్ కమాండర్స్ ప్రెస్ కాన్ఫరెన్స్ హోటల్ నోవెటెల్ కన్వెన్షన్ హాలులో ఉంటుంది. సాయంత్రం 6 గంటల నుంచి 8.30గంటల వరకూ ఐఎన్ఎస్ శాతవాహన స్టేడియంలో ఈవెంట్స్ (సాంస్కృతిక)

ఉంటాయి. 6వ తేదీ ఉదయం 9 గంటలకు విశాఖపట్నం హార్బర్‌లో ఫ్లీట్ రివ్యూ ఉంటుంది. 11.45గంటల నుంచి సాయంత్రం 5.20వరకు. 6.30గంటలకు 'ఇండియన్ నేవల్ బ్యాండ్' సంగీత కార్యక్రమం మెరైన్ ఆడిటోరియంలో జరుగుతుంది. రాత్రి 7.25 నుంచి 9 గంటల వరకూ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఈఎన్‌సి కార్యాలయంలో భారీ విందు ఇస్తారు. 7వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ 'అంతర్జాతీయ మారిటైం కాన్ఫరెన్స్' తాజ్ గేట్‌వే హోటల్ గోదావరి హాలులో ఉంటుంది. సాయంత్రం 5.30గంటల నుంచి 7గంటల వరకూ అంతర్జాతీయ నగర పరేడ్ కార్యక్రమం ఆర్‌కెబీచ్‌లో ఉంటుంది. ఈ కార్యక్రమానికి కూడా ప్రజలందరికీ ఆహ్వానం ఉంది. అదే రోజు సాయంత్రం 7.15 గంటల నుంచి 9.30 గంటల వరకూ చీఫ్ నేవల్ అధికారుల రిసెప్షన్ హోటల్ నోవటల్ కన్వెన్షన్ హాలులో ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఈ సందర్భంగా ఉంటాయి. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకూ 'ముగింపు వేడుకలు' నేవల్ ఇనిస్టిట్యూట్‌లో ఉంటాయి. 9వ తేదీ ఉదయం నుంచి విదేశీ షిప్‌లన్నీ ఆయా దేశాలకు పయనమవుతాయి. భారత నావికాదళ అధిపతి ఆర్‌కె ధావన్ ఆధ్వర్యాన 8, 9వ తేదీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆర్‌కెబీచ్‌లో '1971 విక్టరీ ఎట్ సీ' స్థూపాన్ని ఏర్పాటు చేశారు. 1997 వరకూ విక్రాంత్ ఈస్టర్న్ ఫ్లీట్‌లో ఉండేది. ప్రస్తుతం ముంబై డాక్‌లో మ్యూజియంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌ను ప్రదర్శనకు పెట్టారు.. తూర్పు తీరం రక్షణ గోడలుగా చుట్టూ కొండలు, డీప్ సీ కావడంతో ఐఎఫ్ఆర్‌కు వేదికైంది.

తూర్పు నౌకాదళ విభాగాలు

భారత నౌకాదళంలో యుద్ధ సన్నాహాలు, నైపుణ్యాలకు సంబంధించి చెప్పుకోదగ్గవి.. ఐఎన్ఎస్ కార్యలాపాలు.. మెరైన్ కమాండోస్, విమాన సేవలందించేందుకు ఐఎన్ఎస్ డేగా నిరంతరం అందుబాటులోనే ఉంటుంది. నౌకాదళంలో ప్రధాన యుద్ధ నౌకలుగా ఐఎన్ఎస్ సహ్యాద్రి, కొచ్చి, ఐఎన్ఎస్ డెస్ట్రోయర్, అస్త్రధారిణి, విక్రాంత్ చెప్పుకోదగ్గవి. చిన్నా చితకా కలిపి మరో 50 వరకూ ఉంటాయి.

వ్యాపారాభివృద్ధిలోనూ...

వ్యాపార లావాదేవీలు, కార్గో బిజినెస్‌కు అత్యంత అనువైన, సానుకూల, శత్రు దుర్భేధ్యమైన ప్రాంతం తూర్పు తీరం. తూర్పు తీరం గుండా వ్యాపారం చేసే 'పెట్టుబడిదార్లను' సమీకరించేందుకు జనవరి 28, 29 తేదీల్లో ఈస్ట్ కోస్ట్ 'మేరిటైం సమ్మిట్' విశాఖలోనే జరిగింది. ప్రస్తుతం నౌకల ద్వారా ఈ తీరాన 60 శాతం వ్యాపారం పెట్రోలియం, బొగ్గు, ఐరన్ రవాణా జరుగుతోంది. దీన్ని 90 శాతానికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'లుక్ ఈస్ట్ పాలసీ' తీసుకొంది. భారతదేశం అంతా ఈ తీరం వైపు చూసేలా చేయడం దీని ఉద్దేశం.

ఏర్పాట్లు ఘనం

ఐఎఫ్ఆర్ కోసం వచ్చే దేశ, విదేశీ అతిథులు, త్రివిధ దళాల అధికార్లకు మంచి విందు వినోదాలను ఏర్పాటు చేశారు. విశాఖలో స్టార్ హోటళ్ల నొవాటల్ నుంచి అత్యధికంగా వంటకాలు వస్తున్నాయి. వివిధ దేశాలకు చెందిన ప్రత్యేక వంటలు కూడా రుచి చూపిస్తున్నారు. 7వ తేదీన రాష్ట్రపతి, ప్రధాని పాల్గొనబోయే ప్రజలు తిలకించేందుకు వీలుగా 1.50 లక్షల పాస్‌లు మీసేవా కేంద్రాల ద్వారా జారీ చేశారు. 20 వేల మంది పోలీసులతో భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్‌లు, బీచ్‌లో కంచెలు వేశారు. కార్పొరేట్ వైద్యులను రంగంలోకి దించి వైద్యసేవలకు సిద్ధం చేశారు. మొబైల్ టాయ్‌లెట్స్ ఎక్కడికక్కడ ఉంచారు. ఆర్‌కెబీచ్‌లో యుద్ధవీరుల స్మారక స్థూపాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఫ్లీట్ రివ్యూను నేరుగా చూడడానికి అవకాశం లేని ప్రజల కోసం 100కు పైగా ఎల్ఇడి తెరలు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు.





చూద్దామా

దట్టమైన మంచు కొండలు, సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు, బౌద్ధ ఆరామాలు, అలనాటి మొగల్ రాజుల చారిత్రక కట్టడాలు, ప్రాచీన దేవాలయాలు, మసీదులు, సోనెమార్గ్ సాహస క్రీడలు, దాల్ లేక్ ఒడిలో ఓలలాడే బోట్ హౌస్‌లు, ఎత్తైన రోడ్డు మార్గాలు, కొన ఒంపుల రైలు ప్రయాణాలు, పేరొందిన మ్యూజియాలు, హిల్‌స్టేషన్లతో... ప్రపంచ వాసికెక్కిన సుందర ప్రదేశం జమ్మూ కాశ్మీరం.

హిమ సీమల్లో కాశ్మీరం

ఏడాది పొడవునా సందర్శకులకు స్వాగతం పలికే ఈ సుందర ప్రదేశాన్ని మొఘల్ చక్రవర్తి జహంగీర్ 'భూతల స్వర్గంగా అభివర్ణించడానికి సాక్షాలుగా నిలిచాయి ఇక్కడి బ్రహ్మోన్డమిన్ పర్వత శ్రేణులు, స్వచ్ఛమైన నీటి ప్రవాహాలు, ఉద్యాన వనాలు, మంచు చర్యలు, పడవ ప్రయాణాలు. దట్టమైన మంచు కొండలో ఉండే శ్రీనగర్‌ను వేసవి రాజధానిగానూ, జమ్మూను వింటర్ రాజధానిగానూ పరిగణిస్తారు ఇక్కడి ప్రజలు. బుద్దాన్ షా, శివ ఖోరి, పీర్ ఖో కావే టెంపుల్, వైష్ణో దేవీ ఆలయం, శంకరాచార్య మఠ్, ఖీర్ భవాని ఆలయాలు ప్రసిద్ధి పొందిన ప్రదేశాలు. ఆపిల్, చెర్రీ తోటలు, గొండోలా సవారీలు, మొఘల్ ఉద్యానవనాలు, కాశ్మీర్ హస్తకళలు, బోట్ హౌసులు, ట్రెకింగ్, వింటర్ గేమ్స్ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు. కాశ్మీర్ వ్యాలీ, జమ్మూ, లడఖ్‌ను ప్రధాన సందర్శనా ప్రాంతాలుగా చెప్పుకోవచ్చు. డిసెంబర్ నుండి మార్చి వరకు శ్రీనగర్‌లోని చాలా భాగం మంచుతో కప్పబడి ఉండటంతో వింటర్ క్రీడలకు ఇది అనువైన సమయం. మార్చి నుండి అక్టోబర్ వరకు ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రకృతి అందాలు తిలకించేందుకు ఈ ప్రదేశం అనువుగా ఉంటుంది. లడఖ్ ప్రాంతంలో చలి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సెప్టెంబర్ నుండి మార్చి నెలలు జమ్మూ సందర్శనకు అనుకూలంగా ఉంటాయి. కాశ్మీర్‌లోని పిర్ పంజాల్ పర్వత శ్రేణులు సాహసక్రీడా ఔత్సాహికులకు, వారి అభిరుచులకు అనుకూలంగా ఉంటాయి. జమ్మూలోని కలమర మహల్ మ్యూజియం, డోగ్రా ఆర్ట్ మ్యూజియాలు సందర్శకులకు ఎప్పుడూ ఆహ్వానం పలుకుతాయి.

అనంత్ నాగ్

కాశ్మీర్‌కి నైరుతిలో ఉండే అనంత్‌నాగ్ కాశ్మీర్ పట్టణ వాణిజ్య రాజధానిగా పేరొందింది. క్రీ.పూ 5000 నాటికే వాణిజ్య పరంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతం నాగరికతకు అద్దం పడుతుంది. హజరత్ బాబా రిషి, గోస్వామి గుండ ఆశ్రమ్, శిలాగ్రా టెంపుల్, నిలా నాగ్‌లు అనంత్ నాగ్‌లో చూడదగిన ప్రదేశాలు. హనుమాన్, శివ తదితర మందిరాలు పేరొందిన ఆలయాలు. అనంత్ నాగ్ సందర్శనకు వెళ్లేవారు అక్కడి నుండి 9 కి.మీ దూరంలో ఉన్న మార్తాండ్ (సూర్య దేవాలయాన్ని) తప్పక దర్శిస్తారు. క్రీ.శ 7-8 మధ్య కాలంలో రాజు లలితాదిత్య ఈ ఆలయాన్ని నిర్మించాడు. 84 స్తంభాలతో పీఠభూమిపై నిర్మించిన మార్తాండ్ ఆలయం అప్పటి శిల్పకళకు ప్రతిబింబంగా నిలిచింది. ప్రస్తుతం శిథిలమై మంచుతో కప్పబడిన ఈ



ఆలయ శిథిలాలను చూసేందుకు టూరిస్టులు అధిక సంఖ్యలో వస్తారు. ఇక్కడి పర్వతాల మధ్య నుండి కాశ్మీర్ లోయ అందాల వీక్షణం సందర్శకులను మరో ప్రపంచానికి తీసుకెళుతుంది.

శ్రీనగర్

జీలం నదీ తీరంలో అందమైన సరస్సులు, పడవ- ఇళ్ళు అసంఖ్యాకమైన మొఘల్ ఉద్యానవనాలతో తూర్పు వెనిస్ నగరంగా ప్రసిద్ధి పొందింది శ్రీనగర్. చారిత్రక, ధార్మిక, పురాతత్వ ప్రాముఖ్యత కలిగిన కాశ్మీర్‌లో 1000 సంవత్సరాల కిందటి మసీదులు, గుళ్ళను సందర్శించేందుకు ఎంతో మంది యాత్రికులు వస్తుంటారు. శంకరాచార్య మఠం, జామా మసీదు, హజరత్‌బల్ మసీదు ఇక్కడ ముఖ్యమైన ప్రదేశాలు. పరీ మహల్, అచబల్ బాగ్, చస్మా షాహీలు, మొఘల్ ఉద్యానవన అందాలను చూసేందుకు ప్రపంచ నలుమూలల నుండి యాత్రికులు వస్తుంటారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సు, నాగిన్ సరస్సు, అంచర్ సరస్సు నగరానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. కాశ్మీర్ వ్యాలీలోని అతి పెద్ద సరస్సు దాల్ సరస్సు. అందమైన హిమాలయాల నేపథ్యంలో షికారాల్లో ప్రయాణంతో దాల్ సరస్సుకు మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇక్కడి పడవ ఇళ్ళు దేశీయ పర్యాటకులనే కాక విదేశీ పర్యాటకులను సైతం విస్మయానికి గురిచేస్తాయి. 1951లో జాతీయ ఉద్యాన వనంగా ప్రకటించబడిన వన్య ప్రాణి సంరక్షణా కేంద్రం శ్రీనగర్‌లోని ప్రముఖ సందర్శనా స్థలం. ట్రెకింగ్, హైకింగ్ వంటి సాహస క్రీడలకు, అమర్‌నాథ్ గుహలకు ట్రెకింగ్ ద్వారా చేరే ప్రయాణాలకు శ్రీనగర్ ఎంతో ప్రాచుర్యం పొందింది.

లడఖ్

జమ్మూ కాశ్మీర్‌లో మరో ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం లడఖ్. సింధూ నదీతీరాన ఉన్న లడఖ్‌ను 'ఆఖరీ శాంగ్రిలా', 'లిటిల్ టిబెట్' అని కూడా పిలుస్తారు. ఇక్కడి సమీపంలో అల్చి, నుబ్రా లోయ, హెమీస్, లమయరు, జంస్కర్ లోయ; కార్గిల్, పంగోంగ్ త్సో వంటి ఎన్నో ముఖ్య సందర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి. అందమైన సరస్సులు, బౌద్ధ ఆరామాలకు ఆలంబనగా నిలుస్తుంది లడఖ్ ప్రాంతం. లడఖీ, పురిగ్, టిబెటన్, హిందీ, ఇంగ్లీష్ ఇక్కడ మాట్లాడే ప్రధాన భాషలు.

కాశ్మీర్

పిర్పంజల్ పర్వత శ్రేణులు హిమాలయాల మధ్య ఉన్న ఓ సుందర లోయ కాశ్మీర్. ప్రతి ఒక్కరూ తప్పక వీక్షించవలసిన ప్రదేశం. ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలు, మసీదులు, సహజ గుహలకు ఈ కాశ్మీర్ వ్యాలీ పేరొందిన ప్రదేశం. జహంగీర్ చక్రవర్తి 1616లో తన భార్య నూర్ జహాన్‌కు కానుకగా నిర్మించిన షాలిమర్ గార్డెన్స్, 1628లో నిర్మించిన ఫైజ్ బక్ష్ "గార్డెన్ ఆఫ్ లవ్ గా పిలవబడే తోటలు సందర్శించాల్సిన ప్రదేశాలు. నాలుగు అంతస్తుల్లో . నిర్మించిన ఈ ఫైజ్ బక్ష్ గార్డెన్ టెర్రస్ నిర్మాణాలు అత్యంత అద్భుతంగా ఉంటాయి. చారార్- ఇ- షరీఫ్ పురాతన దేవాలయాల్లో ఒకటి. సానానార్, సానా గ్రామాలు జమ్మూ కాశ్మీర్‌లో అత్యంత సుందర ప్రదేశాలు. పట్నీ తోప్‌కి 20 కి.మీ దూరంలో ఉన్న సానా, సార్ అనే సరస్సుల వల్ల ఈ ప్రదేశానికి ఆ పేరు వచ్చింది. సముద్ర మట్టానికి 2079 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశం స్కేటింగ్, పారాగ్లైడింగ్, క్యాంపింగ్, హాట్ ఎయిర్ బెలూనింగ్, హార్స్ రైడింగ్, మౌంటెనింగ్ వంటి వాటికి అనువైన ప్రదేశం. ఇక్కడ జరిగే అన్ని సాహస కార్యకలాపాలను జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది.

హెమీస్

హెమీస్ ప్రాంతం లేహ్‌కు 40 కి.మీ దూరంలో ఉంది. ఇండస్ నదీ తీరాన ఉన్న బౌద్ధ గొంపలను (ఆశ్రమాలు) హెమీస్ అంటారు. ఆ ప్రాంతానికి తరువాత ఆపేరే స్థిరపడింది. హెమీస్‌లో ఉన్న బుద్ధుని తామ్ర విగ్రహం, కాలచక్ర (ఆర్ట్ ఆఫ్ షోర్ క్వార్టర్స్)కు సంబంధించిన అందమైన చిత్రలేఖనాలు, నదీ తీరాన ఉన్న హెమీస్ నేషనల్ పార్క్ ఇక్కడ చూడదగిన ప్రదేశాలు. 4400 చ. అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ నేషనల్ పార్క్ భారత దేశంలో రెండవ అతి పెద్ద సంరక్షణా కేంద్రంగానూ, ఆసియాలో అతి పెద్ద నేషనల్ పార్క్‌గా గుర్తించబడింది. లమెర్జియెర్ రాబందు, గోల్డెన్ ఈగల్, స్నో లెపర్డ్, డీర్, మకాక్స్, రెడ్ ఫాక్స్‌లను మనం ఇక్కడ చూడవచ్చు. ఏప్రిల్ నుండి జూన్ మధ్య ఈ ప్రదేశాన్ని సందర్శించవచ్చు.

అమర్‌నాథ్

శ్రీనగర్‌కు 145కి.మీ దూరంలో ఉన్న అమర్‌నాథ్ తీర్థయాత్రా స్థలాల్లో ప్రధానమైనది. అమర్‌నాథ్ గుహలలో మంచుతో ఉన్న శివ లింగాన్ని సందర్శించేందుకు ప్రయాణీకులు 3888 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహలను సందర్శిస్తారు. ఉష్ణోగ్రతలు అధికంగా పడిపోయే ఈ ప్రదేశ సందర్శనకు మే నుంచి అక్టోబరు మధ్య మాసాలు అనువైనవి.

కార్గిల్

కార్గిల్‌ను ల్యాండ్ ఆఫ్ ఆగాస్ అని పిలుస్తారు. లడఖ్‌లోని ఓ గ్రామం కార్గిల్. ఈ పేరు చెప్పగానే మనందరికీ గుర్తొచ్చేది 1999లో జరిగిన పాకిస్తాన్ యుద్ధం. అదే కార్గిల్ వార్. ఇది భారత్ పాకిస్తాన్ మధ్య విస్తరించడంతో ఇక్కడ మిలిటరీ గస్తీ ఎక్కువగా ఉంటుంది. విదేశీ పర్యాటకులను ప్రత్యేక అనుమతులు ఉంటేనే ఇక్కడకు అనుమతిస్తారు. బౌద్ధుల 8 ముఖ్య బౌద్ధ ఆరామాలలో ఒక ముఖ్య ఆరామం ఈ ప్రాంతంలో ఉంది. 108 బౌద్ధ పవిత్ర స్థూపాలు కార్గిల్‌లో సందర్శించదగినవి. ముల్బెఖ్



ఆరామంలోని లాఫింగ్ బుద్ధ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. కాశ్మీర్ ఉప జిల్లా జన్స్కార్‌లోని ప్రకృతి అందాలను దర్శించేందుకు వేలాదిగా టూరిస్టులు వస్తుంటారు. ఈ ప్రాంతం 8 నెలల పాటు మంచుతో కప్పబడి ఉంటుంది.

గుల్మార్గ్

జమ్మూ కాశ్మీర్, బారాముల్లా జిల్లాలో సముద్ర మట్టానికి 2720 అడుగుల ఎత్తున ఉంది ఈ గుల్మార్గ్ పట్టణం. గుల్మార్గ్ అంటే 'పూల మార్గం'. పేరుకు తగ్గట్టుగానే ఉంటుంది ఈ ప్రదేశం. అపర్వాట్ శిఖరం నుండి కరిగిన మంచు 'నింగ్లె నల్లా' అనే ప్రవాహం ద్వారా కిందపడి జీలం నదిలో పోపోరే వద్ద కలుస్తుంది. ఈ సుందర దృశ్యాన్ని టూరిస్టులు ఖిలన్ మార్గ్ వద్ద ఓ బ్రిడ్జి పైనుండి చూడవచ్చు. ఇక్కడి ఆహ్లాదకర వాతావరణం, అద్భుత ప్రదేశాలు, గార్డెన్లు సందర్శకులను మరో ప్రపంచానికి తీసుకెళతాయనడంలో సందేహం లేదు. కాశ్మీర్ వ్యాలీలో బోట్ హౌస్ విదేశీ టూరిస్టులకు ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అధునాతన సదుపాయాలతో రూపుదిద్దుకున్న ఈ హౌస్ బోట్లు టూరిస్టులకు, హనీమూన్ జంటలకు ఆహ్లాదాన్నిస్తాయి. ఉత్తర హిమాలయాల వద్ద ఉన్న జమ్మూ కాశ్మీర్‌లో మరెన్నో వీక్షించదగిన ప్రదేశాలు ఉన్నాయి. హిమాలయ్‌కి గోధ్ మే, హైవే, జబ్‌తక్ హై జాన్, రాక్ స్టార్, రోజా, లక్ష్య, మిషన్ కాశ్మీర్, దిల్‌సే వంటి బాలీవుడ్ సినిమాల సన్నివేశాలు, పాటల చిత్రీకరణ జమ్మూ కాశ్మీర్‌లోనే జరిగింది. తెరపై హిమసీమల్లో కాశ్మీరీ అందాలను చూసి పరవశులైన ప్రకృతి ప్రేమికులు ప్రత్యక్షంగా చూసిరావాల్సిన చక్కని ప్రదేశం ఈ జమ్మూ కాశ్మీరం.

ట్రావెన్‌కోర్ సిస్టర్స్

పద్మిని, లలిత, రాగిణి... ముగ్గురూ ట్రావెన్‌కోర్ సిస్టర్స్‌గా ప్రసిద్ధులు. నటనలో, నాట్యంలో వీరిది అందె వేసిన చెయ్యి. దక్షిణాది చిత్రాలతో పాటు హిందీ సినిమాల్లోనూ నటించారు. తిరువనంత పురంలోని ఉమ్మడి కుటుంబంలో పెరిగిన వీరు 1940 నుంచి 50ల్లో అనేక చిత్రాల్లో మెరిసి మెప్పించారు. శాస్త్రీయ నృత్యంలో చాలా పాపులర్ వీరు.

stars

తాషి- నాన్సీ మాలిక్

ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి కవలలు వీరు. ఇరవై నాలుగేళ్లకే ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించి 'ఎక్స్‌ప్లోరర్స్ గ్రాండ్ స్లామ్' పూర్తి చేసిన ఘనాపాటీలు. ఎవరెస్ట్‌ను, ఉత్తర-దక్షిణ ధృవాలను అధిరోహించడం ద్వారా 'త్రీ పోల్స్ చాలెంజ్'ను సాధించిన సిస్టర్స్.

సూపర్ సి

అనుబంధాలు...ఆప్యాయతలు... అన్నదమ్ములకే కాదు. అక్కచెల్లెళ్లకూ వుంటాయి. అందుకే సినిమాలు సైతం ఇద్దరి బంధాల మీదా వచ్చి అలరించాయి. 'అన్నదమ్ముల అనుబంధం, అన్నయ్య, తమ్ముడు'కు దీటుగా 'అక్కాచెల్లెలు, అక్కాచెల్లెళ్లు, మా మంచి అక్కయ్య' చిత్రాలు వచ్చాయి. అయితే నిజ జీవితంలో వీరి మధ్య ఈర్ష్యా ద్వేషాలూ పొడసూపుతుంటాయి. అయినాసరే ప్రేమాభిమానాలతో అద్భుత విజయాలు సాధించి శభాష్ అనిపించుకున్న సిస్టర్స్ మన ముందు చాలా మందే వున్నారు.

లతా మంగేష్కర్ - ఆశా భోంస్లే

భారతీయ సంగీత సామ్రాజ్యాన్ని ఏలిన సీనియర్ గాయనీమణులు లత (86), ఆశ(82). ఈ వయసులోనూ వీరి గొంతు అమృతం చిలుకు తుంటుంది. లత వెయ్యికి పైగా హిందీ చిత్రాల్లో పాడి రికార్డు సృష్టించడమే కాక 'భారత రత్న'ను అందుకుంది. అత్యధిక పాటలు పాడిన గాయనిగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది ఆశా. అయితే ఇద్దరి మధ్య వైరానికి సంబంధించిన వార్తలు అడపాదడపా వచ్చినా ... ఇద్దరూ ఒకరి పట్ల మరొకరు ప్రేమగా వుండటమే కాదు. గౌరవాభిమానాలు ప్రకటించుకుంటారు.

కరిష్మా-కరీనా కపూర్

బాలీవుడ్‌లో నాటికీ నేటికీ ఎందరో అక్కాచెల్లెళ్లు వున్నప్పటికీ కపూర్ కుటుంబం నుంచి వచ్చిన కరిష్మా-కరీనాలు చిత్ర రంగంపై చక్కటి ముద్ర వేశారు. అక్కచెల్లెళ్లలా కంటే మంచి స్నేహితుల్లా మెలుగుతారు. సందర్భం వచ్చిందంటే చాలు సోదరి లోలో (కరిష్మా) గురించి చెప్పకుండా వుండదు బెబో (కరీనా). ఒకరి తర్వాత ఒకరు బాలీవుడ్‌ను ఏలినా ... వారి మధ్య అణుమాత్రం వైరం మాత్రం కనిపించకపోవడం విశేషం.

బర్ఖా-బహార్ దత్

ప్రసిద్ధ జర్నలిస్టు ప్రభాదత్ కుమార్తెలు వీరు. బర్ఖా దత్ కాస్త చదువుకున్న వారందరికీ పరిచయమే. కార్గిల్ వార్ జరిగినప్పుడు ...కదన రంగ కథనాలను ప్రపంచ ప్రజల కళ్లకు కట్టిన సాహసి. పద్మశ్రీతో సహా ఎన్నో అవార్డులు అందుకుంది. ఆమె సోదరి బహార్ దత్ తక్కువేం కాదు. పర్యావరణ జర్నలిస్టు. బయాలజిస్టు. 'గ్రీన్ వార్స్' పుస్తక రచయిత. గ్రీన్ ఆస్కార్ (2006) అందుకుంది.

కేట్ - పిప్పా మిడిల్టన్

కేట్ కేథరిన్ మిడిల్టన్ ఇంగ్లండ్ యువరాజు విలియమ్ భార్య. ఆమె సోదరి ఫిలిప్పా. పిప్పాగా సుపరిచితం. ఈమె సామాజికవేత్త, రచయిత్రి, కాలమిస్టు అయినప్పటికీ కేట్ సోదరిగానే ప్రపంచానికి పరిచయం. ఇద్దరివీ వేర్వేరు ప్రపంచాలైనప్పటికీ కలిసి ఎక్కడికి వెళ్లినా అభిమానగణం సమృద్ధిగానే వుంటుంది.

...స్టర్స్

బియాన్సీ-సోలాంజే నోల్స్

అమెరికన్ సింగర్ బియాన్సీ తెలియని సంగీత ప్రియులుండరు. ఆమె పేరు చెప్పిన వెంటనే గ్రామీ అవార్డు మదిలో మెదులుతుంది. అనేకసార్లు గ్రామీ అవార్డుకు నామినేట్ అయి 20 గ్రామీలను సొంతం చేసుకుంది. 'క్వీన్ బీ' ఆమె ముద్దు పేరు. 'ఆల్ గాళ్స్ బ్యాండ్ డెస్టినీ చైల్డ్'లో లీడ్ సింగర్. ఆర్ అండ్ బి, పాప్‌లో సైతం రాణించింది. ఇక ఆమె చెల్లెలు సోలాంజే నోల్స్‌కు కూడా అక్కే రోల్ మోడల్. ఇద్దరూ చాలా అన్యోన్యంగా వుంటారు. కుటుంబం నడిపే వ్యాపారాభివృద్ధి కోసం కలిసి మోడలింగ్ చేశారు.

నోరా జోన్స్- అనౌష్కా శంకర్

సితార్ వాద్యకారుడైన పండిట్ రవిశంకర్ కుమార్తెలు వీరు. అయితే తల్లులు వేరు. ఇద్దరూ కలిసి పెరగలేదు. తల్లిదండ్రులు విడిపోయాక తల్లితో కలిసి పెరిగింది నోరా. అయితే రవిశంకర్ ఆఖరి రోజుల్లో తిరిగి ఆయనతో గడిపే అవకాశం లభించిందామెకు. అనౌష్క నాలుగు గ్రామీలకు నామినేట్ కాగా, నోరా ఏకంగా తొమ్మిది గ్రామీలను సొంతం చేసుకుని... ఈ దశాబ్దపు కళాకారిణిగా బిల్‌బోర్డ్ మ్యాగజైన్ కవర్ మీద తళుక్కుమంది.

బ్రోంటే సిస్టర్స్

ఛార్లెట్, ఎమిలీ, ఆనే... ముగ్గురూ బ్రోంటే
స్టర్స్‌గా పేరు సంపాదించుకున్నారు. పందొమ్మి
వ శతాబ్దానికి చెందిన ఈ అక్కాచెల్లెళ్లు అనేక
వలలు రాశారు. చాలా చిన్న వయసు నుంచే
థలు రాయడం మొదలెట్టారు. చార్లెట్ 'జేన్
ర్', ఎమిలీ 'ఉథరెంగ్ హైట్స్', ఆనె 'ఏగ్నెస్ గ్రే'
వలలు గొప్ప క్లాసిక్స్‌గా గుర్తింపు పొందడమే
ాదు. సాహితీ ప్రియులకు ఇష్టమైన పుస్తకాల
ాబితాలో నిలిచిపోయాయి.

వీనస్-సెరినా విలియమ్స్

పరిచయం అక్కర్లేని ప్రపంచ ప్రసిద్ధ సోదరీమణులు వీరు. అక్కాచెల్లెళ్లది చూడచక్కని జంట. ఇద్దరూ కలిసి 28 గ్రాండ్‌స్లామ్ (సింగిల్) టైటిల్స్ సాధించారు. చిన్ననాటి నుంచి నాన్నే వాళ్ల కోచ్. జంటగా 22 డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గారు. నిజం చెప్పుకోవాలంటే మహిళా టెన్నిస్ ముఖచిత్రాన్నే మార్చేశారీ సోదరీమణులు.



చెంపకు చారెడేసి కళ్ళు
నలుపు తెలుపు వెండితెర వెలిగిపోయేంత
అందం
చూపు మరల్చుకోలేని సమ్మోహన రూపం...
కోయిల గానం... హంస నర్తనం...ఇవన్నీ
మాలగా అమర్చుకున్న
'సినీ మాల పిల్ల' కాంచనం....

సినీ 'మాలపిల్ల'

ఆ రోజుల్లో ఆంధ్రా ప్యారిస్ అని పిలవబడే 'తెనాలి'లో అద్భుతమైన కళాకారులు తమను తాము మెరుగు దిద్దుకున్నారు. కన్నాంబ, శారద, గుమ్మడి (తెనాలి దగ్గర ప్రాంతం) ఏ.వి.యస్ ఇంకా రంగస్థల కళాకారులు ఆ రోజుల్లో రంగస్థలానికి సేవలందించేవారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు. కాంచనమాల చిన్నతనం నుంచి వైవిధ్యమైన జీవన సరళి అలవర్చుకుని అందరి మన్ననలూ పొందేది. నెమ్మదిగా స్పష్టంగా మాట్లాడటం...తక్కువ మాట్లాడటం... ఎక్కువ ఆలోచించడం, చాలా సున్నితమైన స్వభావం కలిగి వుండటం, రంగస్థలం మీద ఎంత కఠినతరమైన పద్యాన్ని గాని పాటని గాని.. అది ఏ రాగంలో వున్నా ఒకసారి వింటే..ఇట్టే గ్రహించేసి మళ్లీ అదేస్థాయిలో అంతకంటే గొప్ప మాధుర్యంతో వినిపించేది. అదీ కాంచన మాల ప్రత్యేకత! ఆనాడు ప్రముఖులు అద్దంకి శ్రీరామమూర్తి, ఆకుల నరసింహారావు, కొచ్చర్లకోట సత్యనారాయణ, అబ్బూరి, డి.వి.సుబ్బారావు ఇత్యాది నటులతో ప్రదర్శనలిచ్చి చూపరుల ప్రశంసల్ని గెలుచుకునేది. 'కాంచనమాల వేదిక మీదుంటే పక్క నటీనటులు కనిపించేవారు కారు' అనుకునేవారు.

సినీరంగ ప్రవేశం

కాంచనమాల అందాన్ని చూసిన సినీ ప్రముఖులు ముఖంమీదే మెచ్చుకోకుండా వుండలేకపోయారు. జెమినీ వాసన్ అయితే ఏకంగా రెండు సంవత్సరాలపాటు తన సంస్థలోనే పని చేయాలని కాంట్రాక్టు రాయించుకొని ఆమె ఇల్లు, కారు, మెయింటెనెన్స్ అన్నీ సమకూర్చగలను అంటూ అగ్రిమెంటు రాయించుకున్నారు. అయితే బయటి సినిమాల్లో అవకాశం వస్తే చేసుకుంటాను అని అభ్యర్థించింది. 'అలాగే! నీ భవిష్యత్తే నాక్కావాల్సింది' అని అంగీకరించారు. కాంచనమాల మొట్టమొదట శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో నటించింది. అందులో 'మిత్రవింద' వేషం. రేలంగి కూడా చిన్న పాత్రలో కనిపిస్తాడు. కాంచనమాల చిన్న పాత్రలో కనిపించినా పలువురి దృష్టిని ఆకర్షించింది. తరువాత వీరాభిమన్యు, గృహలక్ష్మి, మాలపిల్ల చిత్రాల్లో కథానాయికగా చేసింది. మాలపిల్ల చిత్రం ఆంధ్ర దేశాన్ని కుదిపేసింది. అగ్ర కులంలో పుట్టిన ఓ అబ్బాయి ఒక మాల పిల్ల అందానికి, సంస్కారానికి అబ్బురపడి ప్రేమలో పడి పెళ్ళిచేసుకున్న వైనం. ఇందులో గోవిందరాజుల సుబ్బారావు, గాలి వెంకయ్య నటించారు. హీరోగా గాలి వెంకయ్య మామగా గోవిందరాజుల, కథానాయికగా కాంచనమాల నటించారు. కొన్ని సన్నివేశాల్లో గోవిందరాజుల అంతటి మహా నటుడిని కాంచనమాల తన పెదవి విరుపుతో, క్రీగంటి చూపుతో, వెన్నెల కురిపించే నవ్వుతో డామినేట్ చేసింది. ఈ సినిమా పట్ల మొదట్లో వివాదాలు చెలరేగినా గూడవల్లి రామబ్రహ్మం వివరణ కొంతమంది బ్రాహ్మణుల ప్రశంసలతో సద్దుమణిగి అఖండ విజయాన్ని చేకూర్చింది. ఇదే సమయంలో కొడవటిగంటి కుటుంబరావు కథ, మాటలు, స్క్రీన్‌ప్లేతో సాగర్ మూవీహౌస్ బొంబాయి కంపెనీ వారి 'వీరాభిమన్యు' చిత్రం బాలీవుడ్‌లో అఖండ విజయం సాధించడంతో ఆమె అందానికి (ఉత్తర పాత్ర) యావత్ భారతదేశం దాసోహమైపోయింది. ఆమెను చూసి ముగ్ధురాలైన ప్రముఖ సీనియర్ నటి, ప్రొడ్యూసర్ జద్దన్ బాయి, నర్గీస్ ఇత్యాది నటీమణులు ఆమెను హిందీ చిత్ర సీమకి రమ్మని మనసారా ఆహ్వానించారు. తెలుగు, తమిళ, హిందీ ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదేవిధంగా మెహబూబ్ ఖాన్ (ఆనాటి హీరో) మోతీలాల్ హిందీ సినిమాల్లో నటించడానికి భారీ ఆఫర్ ఇచ్చారు. ఆమెకు ఆలోచించుకునే వయసూ లేదు. తెలివితేటలూ లేవు. ఒక మహారాణిలా ఆమెను పరిశ్రమ చూసుకుంది.

ఆణిముత్యాలు

రాశి కన్నా వాసి గొప్పదన్న విషయం కాంచనమాల కెరీర్‌లో అక్షరసత్యమైంది. శ్రీకృష్ణ తులాభారం, విప్రనారాయణ, వీరాభిమన్యు, గృహలక్ష్మి, మళ్ళీ పెళ్ళి, వందేమాతరం, ఇల్లాలు, మహి రావణ, బాలనాగమ్మ, మాలపిల్ల, మాయాబజార్ (హిందీ), సహారా (హిందీ), జింబో (హిందీ), చోటీబహెన్ (హిందీ), ఫిర్ వోహీ దిల్ లాయాహూ (హిందీ), నర్తనశాల... ఆమె జీవితంలో అపస్మారక స్థితిలో నటించిన చివరి చిత్రం నర్తనశాల. గృహలక్ష్మి చిత్రంలో నాగయ్యతో.. మాలపిల్లలో గాలి వెంకయ్యతో... మళ్ళీ పెళ్ళి చిత్రంలో వై.వి.రావుతో చేసింది. అయితే ఎక్కువ చిత్రాలు వై.వి.రావు, చిత్తూరు వి.నాగయ్యతో నటించింది. భారతదేశంలో ప్రతి ఒక్కరూ ఆమె మాటా, పాటా, నటనని ఇష్టపడ్డారు. పండిత పామరులు సినీ ప్రముఖుల ప్రశంసలతో ఆమె పేరు మారుమోగి పోయింది. అదే సమయంలో అశనిపాతంలా జెమినీ వాసన్ కేసు చుట్టుకుందామెను. అప్పటికే మాలపిల్ల హీరో గాలి వెంకయ్య (వెంకటేశ్వరరావు)తో పెళ్ళయి పచ్చగా వుంటున్న సందర్భం. స్టార్‌డమ్ ఒక పక్క పేరు ప్రతిష్టలు మరో పక్క, అభిమానుల నీరాజనాలు ఇంకో పక్క ఉక్కిరిబిక్కిరైపోతోంది. ఇటువంటి సమయంలో వాసన్ కోర్టు నోటీసులు పట్టించుకోలేదు. పట్టించుకునే తీరిక లేదు. అదే కాంచనమాల కొంప ముంచింది.

ఆకాశం నుండి పాతాళంలోకి

ముందుగా కాంచనమాల మీద ప్రచారాలు మొదలయ్యాయి. ఆమె సున్నితమైన మనసు గాయపడింది. ఇది చేసేది, ఆమె వెనుక కుట్రలు పన్నుతున్నది ఎవరో అర్థం కాలేదు. జెమినీ వాసన్ గొడవ తడిసి మోపెడయ్యింది. చినికి చినికి గాలివానయ్యింది. కోర్టు కేసుల్లో ఉచ్చు బిగుసుకుంది. వాసన్‌ను కలవడానికి మనస్కరించని కాంచనమాల ఆ నోటీసులకు సమాధానంగా అంతవరకూ సంపాదించింది మొత్తం మూటగట్టి ఆయన ముందుంచి తల కడుక్కుంది గానీ వచ్చే నిందలు, అవే ప్రచారాలు... భరించలేకపోయింది. మానసికంగా కుంగిపోయింది. మనసు అదుపు తప్పి ... శూన్యంలో జీవించడం మొదలుపెట్టింది. స్టార్‌డమ్ వెక్కిరించి కాంచనమాలని పిచ్చిదాన్ని చేసింది. ఆమె క్రీగంటి చూపు కోసం నెలలు, సంవత్సరాల తరబడి చూసినవారు తప్పించుకు తిరగసాగారు. ఆమె ఆత్మీయులనుకున్న వారందరూ ముఖం చాటేశారు. ఆమెను ఆరాధించామంటూ వెంటబడిన వారందరూ కనుమరుగయ్యారు. కాంచనమాల పిచ్చిది. కాంచనమాల మనలోకంలో లేదు అన్న ప్రచారం ఆమెను మరింత పిచ్చిదాన్ని చేసింది. కాంచనమాల నిజంగా పిచ్చిదానిగా మారిపోయింది. కాదు పరిశ్రమలో ఆమె రాక కోసం పడిగాపులు కాసినవారు, ఆమె మోచేతి కింద నీళ్ళు తాగినవారు ఆమెను పిచ్చిదాన్ని చేశారు.

శోభన్‌బాబు సత్కారం

చెన్నైలో ఫిలించాంబరు ఉండేది. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఇంటూరి వెంకటేశ్వరరావు సారథ్యంలో 'మాలపిల్ల' ప్రదర్శనకు కాంచనమాల గాలి వెంకయ్యలను ఆహ్వానించారు. ఆమెతో కలిసి కూర్చొని ప్రదర్శన చూసిన శోభన్‌బాబు కంటతడి పెట్టి ఆమెను సముచితరీతిలో సత్కరించారు. ఈ సంఘటన జరుగుతున్నంతసేపూ ఆమె ఏదో ప్రపంచంలో విహరిస్తోంది. ఆమె శూన్యదృక్కులు... ఆమె ప్రపంచం వేరు. ఆమెకీ ప్రపంచంతో సంబంధం లేదు. 'దినదినమూ పాపడ్ని దీవించిపొండి.. దేవలోకము లోని దేవతలారా' అంటూ కూనిరాగం ఆమెకు తోడు. ఈ పాట ఆనాట తల్లులందరూ పాడుకున్న పాటే ఇది కాంచనమాల పాడిన పాట. సినిమా జోల పాటల్లో మొదటి పాటగా చెప్పుకోవచ్చు.

ఆమెకు సాటి లేరు

కాకిలా కడవరకూ బతికే బదులు హంసలా ఆరు మాసాలుంటే చాలు అంటారు అదే నిజమైంది కాంచనమాల జీవితంలో.. కాంచనమాల 'అందం' ఈ నాటికీ అందానికి నిలువెత్తు నిదర్శనం. ఎవరికైనా చంపకు చారడేసి కళ్ళుంటే కాంచనమాలలా వుందని ఉదహరించడం పరిపాటే! 1923 తెనాలిలో జన్మించిన మాల జనవరి 24, 1981లో చనిపోయింది. ఆమె లేదు. ఆమె అందం మాత్రం ప్రేక్షకుల హృదయ మందిరాల్లో దేవతలా వుంది.

ఇమంది రామారావు
9010133844





అక్కడ సీసాల్లోనే తినాలి

వ్యాపారంలో విజయం సాధించాలంటే వెరైటీ వుండాలంటున్నారు ఉక్రెయిన్ వ్యాపారవేత్తలు. వారి మాటల్లోనూ వాస్తవం లేకపోలేదు! 'కొత్తొక వింత. పాతొక రోత' అన్న సామెత బాగా వంటపట్టించుకున్నారో ఏమో! మార్కెట్లోకి కొత్తగా ఏదైనా కనిపిస్తే ఎగబడిపోతుంటారు వినియోగదారులు. ఇప్పుడు ఉక్రెయిన్‌లో అదే జరుగుతోందట! ఆ దేశ రాజధానిలో ఇటీవల ప్రారంభించిన 'జార్ బార్' అందుకు తాజా ఉదాహరణ. ఈ బారు సార్థకనామధేయురాలు. సూపు, కాఫీ, ఐస్‌క్రీమ్, కాక్‌టెయిల్స్...ఇలా ఏదైనాసరే... సీసాల్లోనే అందిస్తారు. హాయిగా ఆరగించొచ్చు. అయితే ఈ విషయం కొత్తగా వచ్చే కస్టమర్లకు అర్థంకావడానికిగాను...బార్ గోడలమీద రకరకాల పదార్థాలతో నిండిన సీసాల బొమ్మలను అతికించారు. అంతేకాదు! బార్‌లో అలంకరణ సామగ్రి, లైట్లు కూడా సీసాల ఆకారంలోనే వుంటాయి.

వైద్యుడు చెక్కిన శిల్పం

భార్య అందంగా వుండాలని కోరుకోవడం సహజం. అయితే అందుకోసం తనకు తెలిసిన విద్యలను ఉపయోగించిన ఘటన బ్రెజిల్‌లో జరిగింది. డేవిడ్ మేట్లాక్ ఆ డాక్టర్ కాగా, వెరోనికా అతని భార్య. డేవిడ్ మాంచి పేరెన్నికగన్న సర్జన్. ఆయన గొప్ప సౌందర్య పిపాసి అనుకోవచ్చు. తన భార్య చెక్కిన శిల్పంలా పర్‌ఫెక్ట్‌గా వుండాలని కోరుకున్నాడు. అనుకున్నదే తడవుగా తనకు తెలిసిన విద్యలన్నిటినీ ఆవిడ మీద ప్రయోగించాడు. అనుకున్నది సాధించాడు. ఆవిడ తీసుకునే ఆహారం, చేయాల్సిన వ్యాయామం ... అన్నీ అతను చెప్పినట్టే చేసి సహకరించింది. పలుసార్లు 'బాడీ బిల్డింగ్' పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా సాధించింది. తమాషా ఏమంటే! ఈవిడ మొదట ఒక పేషెంట్‌గా డాక్టర్ డేవిడ్‌ను కలుసుకుంది. అది కూడా తనకు పాప పుట్టాక శరీరాన్ని ఫిట్‌గా వుంచుకోవడానికి, అదనంగా పేరుకు పోయిన కొవ్వును తగ్గించుకోవడానికి అవసరమైన శస్త్రచికిత్స కోసం సంప్రదించింది. అయితే అప్పుడు ఆవిడకు గానీ, ఆయనకు గానీ తెలీదు భవిష్యత్తులో ఇద్దరూ భార్యాభర్తలవుతారని. అయితే ఆ తర్వాతే ఆయన ఒక సూచన చేశాడు. లైపోసక్షన్ వంటి ప్రక్రియల ద్వారా అనవసరపు కొవ్వు తీసేసి అందంగా తయారుచేస్తానన్నాడు. అదే ఆలోచనలో వున్న వెరోనికా అందుకు అంగీకరించడమే కాక సహకరించిందికూడా. ఆయన చెప్పిన విధంగా ఆహారనియమాలు పాటించడం, వ్యాయామం చేయడంతో చక్కటి శరీరాకృతిని సొంతం చేసుకుంది. ఆ తర్వాతే వారిరువురు వివాహం చేసుకున్నారు. వెరోనికా కూతురుకు ఇప్పుడు పన్నెండేళ్లు. తను మాత్రం సహజసిద్ధంగా తను ఎలా వున్నానో అలా వుండడానికే ఇష్టపడతానంటోంది. అంతేకాదు! ఆరోగ్యకరమైన ఆహారం రుచిగా వుండదని, అందం కోసం కాస్మొటిక్ సర్జరీల జోలికి వెళ్లబోనని చెప్తోంది ప్రశాంతంగా.



వింత లోకం

కార్కు ఖడ్గమృగం

'ఖాళీ సమయాన్ని అలా వృథా చేయకపోతే ఏదైనా ఉపయోగపడే పని చేయకూడదూ?' అతని భార్య సూచన లాంటి సలహా. 'ఏం చేయమంటావ్?' అతని ప్రశ్న. 'ఏదో ఒకటి. పదిమంది మెచ్చుకునే పని' ఆమె ఆఖరి జవాబు. 'అయితే నేను చాలా ఏళ్లగా పోగు చేస్తున్న బీరు కార్కులతో జిరాఫీ బొమ్మ చేయనా?' అడిగాడు ప్రేమగా. 'నీ ఇష్టం' మెచ్చుకోలుతో కూడిన సమాధానమిచ్చింది ఆమె. 'ఊ...జిరాఫీ గురించి మర్చిపో... ఎందుకంటే అది చాలా పొడవుగా వుంటుంది. ఖడ్గమృగం తయారుచేస్తాను. సంతోషమేనా' అడిగాడు ఆమె కళ్లల్లోకి చూస్తూ. 'మీరు ఏది చేసినా నాకు ఇష్టమే' చిరునవ్వుతో కూడిన జవాబిచ్చిందామె.

పై సంభాషణలో అతను జిమ్ అయితే... ఆమె మేరీ. వీరు కాలిఫోర్నియాకు చెందిన భార్యాభర్తలు. వారిద్దరి మధ్య మూడేళ్ల కిందట జరిగిన సంభాషణ అది. వీరికి బాబ్-నెల్సన్ జంట కూడా తోడైంది. గ్యారేజీ అందుకు వేదికైంది. ఫైవుడ్, ఫోమ్, కార్కులను ఉపయోగించి ...అంతర్జాలంలోంచి దిగుమతి చేసుకున్న ఖడ్గమృగం బొమ్మ సాయంతో భారీ కార్కు ఖడ్గమృగాన్ని రూపొందించారు. కచ్చితంగా చెప్పుకోవాలీ అంటే అది పన్నెండు అడుగుల భారీ బొమ్మ. ముచ్చటగా మూడేళ్లు కష్టపడి తయారుచేశారు. దీన్ని చూసిన వీరి నేస్తాలంతా ఒకటే గొడవ. ఆ బొమ్మను ఆర్ట్ ప్రైజ్ కాంపిటీషన్‌కి పంపించమని. ఒకవేళ అక్కడ గెలుపొందితే 200000 డాలర్ల బహుమతి లభిస్తుంది.

లేకపోతే... దాన్ని బయట మార్కెట్లో అమ్మి వచ్చిన పైకంతో దానధర్మాలు చేయాలని... ముఖ్యంగా అంతరించిపోతున్న ఖడ్గమృగాలను కాపాడుకోవడం కోసం ఏర్పడిన 'ఇంటర్నేషనల్ రైనో ఫౌండేషన్'కి ఎంతో కొంత సాయం చేయాలని వారి కోరిక.



నేను హత్య చేశాను

నేను హత్య చేశాను
నా కన్నీళ్ళను కార్చుకుంటూ
నా గుండెను రాయిలా మార్చుకుంటూ
తుంటరి వయసులో ఒంటరిగా ఆలోచించి
నేనొక హత్య చేశాను
అక్కచెల్లెళ్లకు పసుపుకుంకాలివ్వాలని
ఎండిన పంటను పొదువుకొని
వెక్కి వెక్కి ఏడ్చే నాన్నకు
ఓదార్పునివ్వాలని
చీకటింట్లో కష్టాల గోడల మధ్య
కుప్పకూలిపోయి కుమిలిపోతున్న అమ్మకి
నేనున్నానని చెప్పే ఓ గుండెధైర్యాన్నివ్వాలని
తుంటరి వయసులో ఒంటరిగా ఆలోచించి
నేనొక హత్య చేశాను
మనసేమో తప్పంది కడుపేమో ఒప్పంది
ఎలాగోల బతకాలని బతుకంది
నేలతల్లి కౌగిట్లో నీటిచెరువులెండినాక
పచ్చనైన పైరులేక ఆకులన్నీ రాలినాక
జీవులన్ని చచ్చినాక పేగులన్ని మాడినాక
ఆశలన్నీ ఆవిరయ్యినాక
తుంటరి వయసులో ఒంటరిగా ఆలోచించి
నేనొక హత్య చేశాను
తప్పులేదు నాకీ పరిస్థితి
తలవంచెను నా దీనస్థితి
కుమిలిపోతు నలిగిపోతు
పట్టుమెల్లి పనికిపోతూ
అలసిపోతు సొలసిపోతు
నాలుగు డబ్బులింటికి తీసుకుపోతూ
తుంటరి వయసులో ఒంటరిగా ఆలోచించి
నేనొక హత్య చేశాను
ఇంతకీ నేనేహత్య చేశానంటే
రేపటి భవిష్యత్తును మార్చే
ఓ అందమైన కలను
చదువుకోవాలనుకొనే నా కలను .

మూగాటి శబరీష్
9885566388

మరో శంబూక వధ

మంచుతెరల్లో నెత్తుటి చారలు
ఏదో తలతెగి అవతల పడింది.
ఈర్ష్య పరుశురాముని గొడ్డల్లా
శిరచ్ఛేదం చేసుకొంటూ పోతుంది
చార్వాకుని వురివేసిన తాడు
మళ్ళీ బిగుసుకొంది
విషపు తుంపరులు రాలుతున్నాయి
అక్షరం శిశువు మీద
పులి పంజా విసురుతుంది
అక్షరానికి గాయాలయ్యాయి
అవి విశ్వవిద్యాలయాలే
అక్కడ ఫ్యాన్‌కు వేలాడిన రోహిత్ తల
వెనుక ఓ పెద్ద హిందూ మహా సముద్రం
వుంది.
ఆ పైన ఓ వేయిపడగల విషసర్పం
ఎందరిని మింగిందో?
కనిపించిన తలకాయల్లో ఇది ఒకటి
అవును! ఆ శ్రీమతి స్మృతిలో
మనుస్మృతి దాగుంది!
ఏది క్రమశిక్షణ?
శాస్త్రవేత్తగా ఎదిగాడంటే శంభూక వధయేనా!
రామమందిర నిర్మాణానికి ఇది మొదటి బలా!
ఆ ఉపన్యాస కేసరి
అంబేద్కర్ పేరును పదే పదే ఉచ్చరిస్తున్నాడు
వేదాల్లోని పుష్పక విమానంమీద
ప్రపంచయానం చేస్తున్నాడు
ఈ గాయకుడు అవతారాలను నుతించే
నారదుడా!
ఈతడూ శూద్రుడే
కాని శూద్ర, అతిశూద్రవధకు
వేదభాష్యం చెబుతున్నాడు.
విశ్వవిద్యాలయం అంటే
అందరూ చదువుకునేది కాదా!
అక్షరానికి వర్ణభేదమా?
అంబేద్కరు పంచమ వర్ణుడేగా
రాజ్యాంగకర్త ఎలా అయ్యాడు?
రిపబ్లిక్ రూపశిల్పి అతడేగా
శిల్పిని తునుమాడి శిల్పాన్ని పూజిస్తారా!
వీరంతా ఏమి ఘోషిస్తున్నారు
నెత్తురు చిందితేగాని ఆ నేతలు ఆగమించరా!
కులం పునాదులు కూల్చాలనే
ప్రతివాదులు కూడా
ఆ కులం పునాది మీదే
నిలబడి సమాజాన్ని మార్చగలరా
ఆ తల్లి కన్నీటి బొట్టు
అగ్నిగోళం అవుతుంది
ఏకలవ్యుని తల్లి కన్నీరు
కురువంశాన్ని కూల్చలేదా!
ఎవరు విద్యావేత్తలు?
ఆహార సృష్టి కర్తలది విద్య కాదా!
కడలిని ఈదడం విద్య కాదా!
నడుము వంచి మొక్కను నాటడం విద్య
కాదా?
పడవ నడపడం విద్య కాదా!
నాలుగు అక్షరాలు వల్లించి
విగ్రహాలకు పెట్టిన నైవేద్యం ఆరగించడం
విద్యా
మీ నుండి ఒక్క శాస్త్రవేత్త
ఎందుకు ఆవిర్భవించలేదు
విశ్వవిద్యాలయాల్లో మొలుస్తున్నవి
విషవృక్షాలా! జీవన శాస్త్రాలా!
మీరు ఎంతమంది బొటన వేళ్ళు తీస్తారు
రాముడు-కృష్ణుడు చంపిన
రావణాసురుడు, నరకాసురుడు
దళిత రాజులు కాదా!
వధతో మీరు మా మేథస్సును చంపగలరా!
శ్రమించే తల్లికి పుట్టినవాడు
అక్షర శిల్పాలు చెక్కడంలేదా!
ఒక్క తల ప్రధాన మంత్రి సింహాసనాన్ని
గజగజ లాడించింది కదా!
ఆ తల్లి కన్నీరు
ఒక ఉప్పెన, ఒక తుఫాను
ఒక జ్వలనం, ఒక సమరం
అంతిమ విజేత ఆ తల్లే
మరణించడం అంటే తిరిగి లేవడమే
ఒక చార్వాకుడు, ఒక బుద్ధుడు,
అంబేద్కర్ తిరిగి లేచారు కదా!
ఈ రిపబ్లిక్‌డే
మరో స్వతంత్ర పోరాటానికి సమర భేరి.

డా॥ కత్తిపద్మారావు
9849741695

◆ కథ

మహిళా చైతన్యం

- సోమిశెట్టి స్వర్ణలత
ఫోన్: 09958960068

అర్ధరాత్రి తటాలున మెలకువ వచ్చింది ప్రసాద్‌కి. గుండెలో ఏదో కన్నపేగు కలుక్కుమన్న తీపిబాధ మనసుని తొలిచేస్తుంది. తన ఆరేళ్ళ కూతురు, భార్య, తెలంగాణా రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఓ కుగ్రామంలో నివసిస్తున్నారు. ఆ ఊరు అంతగా అభివృద్ధికి నోచుకోలేదు. అందువల్ల ఇంటర్ వరకే చదివాడు. దానికి తోడు ఆర్ధికంగా వెనకబడ్డ కుటుంబం తనది! అమ్మానాన్నా కాలం చేసి ఏడాది అవుతుంది. ఆ ఊరిలోనే జీవనం సాగిస్తే ఎంత సంపాదించినా అతుకుల బొంతకు కుట్టేసినా అతకదని అర్ధం అయింది. అందుకే దుబాయ్‌లో ఒక చిన్న ఉద్యోగం అతి కష్టంగా తెలిసిన వారి ద్వారా సంపాదించాడు.

ఐదు లక్షల రూపాయలు అప్పు చేసి మరీ వెళ్ళాడు. అక్కడ ఆఫీస్‌కి వెళ్ళాలన్నా ఐదు కి.మీ. సైకిల్ పై వెళ్ళేవాడు. నిప్పులు చెరిగే ఎండలో సైకిల్ మీద వెళ్తుంటే కళ్ళుతిరిగి పడిపోతానేమో అనిపించేది అతనికి. ఆ సమయంలో భార్య, ముద్దులొలికే కూతురు పూజ గుర్తొచ్చి నవనాడులకి చైతన్యపు గాలిని ఊదుకునే వాడు మనసు ఉపశమనం కోసం!

ఒక రోజు అర్ధరాత్రి ఫోన్ మోగడంతో ఉలిక్కిపడి లేచి రిసీవర్ చెవిలో పెట్టుకున్నాడు "ఏమండీ! రాత్రులు ఒంటరిగా పడుకోవాలంటే నాకు చాలా భయంగా ఉంది ఇక్కడ. మీరు ఇక్కడ ఉండరని తెలిసి మన వీధి కుర్రాళ్ళు కొంతమంది అర్ధరాత్రి దాటినా కూడా ఆరుబయటే తచ్చాడుతున్నారు" కంగారుగా చెప్పింది కుసుమ!

"ఒంటరిపక్షినని, మగదిక్కు లేని సంసారమని ఆకతాయిల ఆగడాలకు అంతే లేదు. రోజూ నిద్ర ఉండడం లేదు. రోజుకో గండం నా ధైర్యానికి పరీక్ష పెడుతోందండీ" భయ విహ్వలయై భారంగా మాట్లాడుతోంది. పక్కనే అమ్మను కరుచుకుని కూతురు పూజ. ఆ చిన్నారి కళ్ళలో ఏం జరుగుతుందో అర్ధం కాని అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది!

"నువ్వేం భయపడకు.. బేలతనం చూపిస్తే వాళ్ళు మరింత రెచ్చిపోతారు. భయమనేది నీ కళ్ళలో టార్చిలైట్ వేసి చూసినా కనపడకూడదు. నిన్ను చూసి పాపకి కూడా బేలతనం అలవాటౌతుంది". దానికి కూడా అర్ధమయ్యే విధంగా తగిన జాగ్రత్తలు చెప్పి, పగలు ఆడుకునే సమయంలో కొత్తవాళ్ళు ఎవరు పిలిచి బొమ్మలు ఇస్తాము, చాక్లెట్ ఇస్తాము అని చెప్పినా వెళ్ళొద్దు అని వివరించు! అలాగే నువ్వు కూడా పక్క వాళ్ళ ఫోన్ నంబర్లు నీ ఫోన్ లో సేవ్ చేసి పెట్టుకో. ఇంకా ఇరుగుపొరుగు వాళ్ళకి కూడా కాస్త పాపని కనిపెట్టుకొమ్మని అభ్యర్ధనగా చెప్పు. ఇక ఉండనా మరి" లాలనగా అన్నాడు ప్రసాద్!

"అలాగేనండీ...అయినా కానీ మీరు లేకపోతే పూజ ఒకటే ఏడుపు. ఎప్పుడూ దిగాలుగా ఉంటుంది. దాని కళ్ళను చూస్తే హరివిల్లు లేని ఆకాశంలా కనిపిస్తుంది. త్వరగా రావడానికి ప్రయత్నించండి" అని ఫోన్ పెట్టేసింది కుసుమ!

భర్త ఇచ్చిన ధైర్యంతో ఆ రాత్రికి ఎలాగోలా కనురెప్పలకి విశ్రాంతి కల్పించింది.

రోజులు గడిచే కొద్దీ భయం నెమ్మది నెమ్మదిగా తన వశం చేసుకుంటోంది తన అంతరంగాన్ని!

•••

ఒక రోజు సాయంకాలం పాపని తీసుకుని షాపింగ్‌కి వెళ్తోంది కుసుమ. పాప పుట్టినరోజుకి ఏదైనా డ్రెస్ తీసుకుందామని. మార్గమధ్యలోనే ఆకతాయిలు వెంటపడ్డారు. వెనుకే వస్తూ అల్లరి పెడుతుంటే నీరుగారే ధైర్యానికి ఊపిరి పోసుకుంది నెమ్మదిగా!

ఉదయమే వార్తాపత్రికలో నిర్భయపై వచ్చిన ఒక కవిత చదివి "చాలా మనోబలాన్ని చేకూర్చే విధంగా ఉంది" అనుకుంది...ఇప్పుడా కవితనే గుర్తుకు తెచ్చుకుంది! పోకిరీల అల్లరి మితిమీరడంతో ఉదయం భర్త ఫోన్‌లో చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న ఫోన్ తీసి వంద నంబర్‌కి డయల్ చేసి మెల్లగా పోలీసులకి ఫిర్యాదు చేసింది. అలాగే పక్కింటి వాళ్లకి కాల్ చేసింది ఎందుకైనా మంచిదని!

"ఈ రాత్రికి రాకూడదు ఎలాగూ ఆయన ఇక్కడ

ఉండడు కదా" అని అవాకులు చెవాకులు పేలుతుంటే.. వెనుదిరిగి గుడ్లురిమేలా చూసింది!

అయినా చలించలేదు. అసభ్య పదజాలంతో వెంటాడుతూనే ఉన్నారు. అకస్మాత్తుగా వీధి మలుపు నుండి పోలీస్ జీప్ వచ్చి ఆగింది సైరన్ మోగించకుండానే!

అప్పుడు కుసుమ గుండెలోని ధైర్యాన్ని హత్తుకుంది... నిన్నెప్పుడూ విడువనని, నా ప్రియ నేస్తం నీవేనని బాసలు చేసింది ఆ క్షణమే!

రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ ఆకతాయిలను పోలీసులు తీసుకెళ్ళి చావచితగ్గొట్టారు.!

రోజులు గడిచే కొద్దీ ముఖం వేళ్లాడేసుకుని తిరగసాగింది కుసుమ. ఒక రోజు తలుపులు దబదబా బాదిన శబ్దం వినిపిస్తే..వెళ్ళింది. ఎదురుగా పక్కవీధి కుర్రాడు. అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలు.

"ఎవరు కావాలి మీకు" అడిగింది కుసుమ. సన్నని వణుకు మొదలైనా అది గుండెకు చేరనివ్వలేదు!

"పాప లేదాండీ! అని వెకిలిగా నవ్వుతూ ఇంట్లోకి వచ్చి కూర్చున్నాడు లోపలికి పిలవకుండానే.

ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. ఇంతలోనే చురుకైన ఆలోచనేదో మెదడులో మెరిసింది మెరుపుతీగలా!

"పాప పక్కింట్లో ఆడుకుంటోంది. ఉండండి... మీ కోసం టీ పెట్టుకు వస్తా" అని చెప్పి వంటగదిలోకి వెళ్ళింది. టీ సిద్ధం చేస్తున్నట్లు గిన్నెలు శబ్దం చేసి గబగబా ఫ్రిజ్ పైన ఉన్న ఫోన్ తీసి పక్కింటి రాధకి మెసేజ్ చేసింది. టీ పెట్టేలోపు ఆ కుర్రాడు హాల్లో టీ.వీ రిమోట్ తీసుకుని ఏదో నీలిచిత్రాల చానెల్ పెట్టుకుని దర్జాగా చూస్తున్నాడు.

ఐదు నిమిషాలు కాకముందే పక్కింటి రాధ వచ్చి హాల్లోనే మాట్లాడుతూ "కుసుమా... నిన్ను ఎవరో అల్లరి పెడుతున్నారని చెప్పావ్ ? పోలీసులకి ఫిర్యాదు చేస్తా అన్నావ్! ఏమయింది." అని ప్రశ్నించింది. అంతలోనే ఎదురుగా కుర్రాడిని చూసి "అవునూ ఈ అబ్బాయి ఎవరూ ! నేనెప్పుడు చూడనే లేదూ" అని మాట్లాడుతూనే వుంది నాన్ స్టాప్ గా!

ఇదంతా చూసి కాలికి బుద్ధి చెప్పాల్సిందే అని ఆకతాయి మెల్లగా జారుకున్నాడు. అది చూసి రాధ వాళ్ళిద్దరూ ముసిముసిగా నవ్వుకున్నారు.! ఆ క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చింది కుసుమ. మర్నాడు సాయంకాలం పక్కవీధిలో కొత్తగా కరాటే మాస్టర్ ఎవరో వచ్చారని ఆ నోటా ఈ నోటా విన్నది. వారి దగ్గరికి వెళ్ళింది నెలకు ఐదు వందల రూపాయలు ఫీజు అని చెప్పారు. రేపట్నుండీ క్లాసుకి తీసుకొస్తానని చెప్పింది. ప్రతి రోజూ పాపని దిగబెట్టి కరాటే మాస్టర్ భార్యతో ఓ గంటసేపు మాట్లాడుకుంటూ వేరే గదిలో కూర్చునేది. అలా మెల్లగా పాప బ్లాక్ బెల్ట్ కి శిక్షణ తీసుకునే వరకు వచ్చింది.

ఒక రోజు ప్రసాద్ కుసుమకి ఫోన్ చేసి " నీకొక శుభవార్త చెప్పాలి. నేను ఇంకో ఆరునెలల్లో ఇండియా వస్తున్నాను. అక్కడే ఏదో ఒక వ్యాపారం మొదలు పెడితే జీవితంలో సెటిల్ అవొచ్చు. మన అప్పులన్నీ తీరిపోతాయి కూడా! అన్నాడు ఆనందంగా!



"చాలా సంతోషకర వార్త చెప్పారండీ! మీరు వచ్చే సమయానికి నేను కూడా ఒక శుభవార్త చెప్తాను. ఇప్పుడే చెప్పను. "సస్పెన్స్" అని నవ్వుతూ ఫోన్ పెట్టేసింది కుసుమ. ఆ తరుణం రానే వచ్చింది. ఐదు సంవత్సరాల తరువాత ప్రసాద్ రావు ఫ్లైట్ దిగి టాక్సీ మాట్లాడుకున్నాడు సొంత ఊరు వెళ్ళడానికి!

ఊరి పొలిమేర సమీపిస్తుందని తెలియగానే మనసులో మట్టి గంధపు చినుకులేవో వర్షిస్తున్న అనుభూతి కలిగింది. సొంత ఊరిని, తన కుటుంబాన్ని కలిసే క్షణానికి హారతులు పడుతున్నాడు ఆనందంతో!

ఇంటి ముందు టాక్సీ దిగి లగేజ్ దించుకుని లోపలికి వెళ్ళాడు. 'నాన్నా' అంటూ తన కలల ఊపిరైన చిన్నారి పూజ దగ్గరగా వచ్చి ముద్దులతో ముంచెత్తింది.

కూతుర్ని చూసిన ఆనందం ఒకవైపు మరోవైపు ఆశ్చర్యం కూడా కన్నుల్లో తొంగి చూస్తోంది. ఏదో అడగబోయే లోపే కళ్లు చక్రాల్లా తిప్పుతూ...

"నాన్నా మీకు తెలుసా! అమ్మ నాకు కరాటే నేర్పిస్తోంది." చెప్పింది పూజ!

ఈ హడావుడికి బెడ్ రూములో తయారవుతున్న కుసుమ నవ్వుకుంటూ బైటికి వచ్చింది.

అవాక్కయ్యాడు మరోసారి!

తెల్లని చీరలో మల్లెలు పెట్టుకుని దర్శనమిస్తుందనుకున్న భార్య ధైర్యానికి చిహ్నమైన కరాటే యూనిఫారం వేసుకుని సాహసిలా అతని ముందు నిలబడింది. భర్త కళ్ళలో కనిపించిన ప్రశ్నాపత్రాన్ని చదివేసింది. వెంటనే సమాధానమిచ్చింది

"మీకొక శుభవార్త చెప్తానన్నా కదా. పాపకి కరాటే నేర్పడం నాకెంతగానో ఉపయోగ పడింది. తనను దింపడానికి వెళ్ళి... అక్కడే బ్లాక్ బెల్ట్ సాధించిన మాస్టర్ గారి భార్య దగ్గర నేర్చుకున్నాను.

ఈ రోజు సాయంకాలం ఆరు గంటలకి మన ఊరి సర్పంచ్ మహిళలను ప్రోత్సహించే పథకంలో భాగంగా పోటీల్లో విజేతలకి బహుమతి ప్రదానం చేస్తున్నారు.

సీనియర్స్ విభాగంలో నేనే ప్రథమ విజేతను. జూనియర్స్ విభాగంలో పాపకి రెండవ బహుమతి వచ్చింది.!

ఇదంతా మీరు నాకు ఇచ్చిన ధైర్యం ప్రోత్సాహంతో సాధించగలిగాను. ఒంటరి స్త్రీ ఎదుర్కునే సమస్యలు ఏమిటో నాకు ఇప్పుడు అర్థమయ్యాయి. నాలాగా మన ఊరి ఆడవాళ్ళు బాధపడ కూడదని నేను శిక్షణా తరగతులు నిర్వహించాలని సంకల్పించాను. మీరు నాకు తోడుంటారు కదూ" అని కళ్ళలో సప్తవర్ణాలను నింపుకుంటూ నిండుగా నవ్వింది.! భర్త తన ఆశయానికి సహకరిస్తాడనే నమ్మకంతో! ✦

నవ్వేల్ - పువ్వేల్



కళ్ళు తిరుగుడు

"రోజూ కళ్ళు తిరుగుతున్నాయి. ఏవైనా మందులు రాసివ్వండి డాక్టర్ " అన్నాడు రవి.

"ఉండవయ్యా ... నీకేం మందులు రాయాలో తెలియక నాకు కళ్ళు తిరగుతున్నాయి" అన్నాడు డాక్టర్.

సిగ్గులేదు!



"సిగ్గులేదటయ్యా నీకు? కూరలు తరుగుతుంటే వేలు తెగిందని సెలవు కావాలంటున్నావా? ఆ మాట అనడానికి నీకు నోరెలా వచ్చిందయ్యా?" అరిచాడు ఆఫీసర్.

"నిజం సార్..నిజంగానే వేలు తెగింది" వినయంగా అన్నాడు రంగారావు.

"నేను గత పాతిక సంవత్సరాలుగా కూరలు తరుగుతున్నాను. ఒక్కసారి కూడా తెగలేదు...." పెద్దగా అరిచాడు ఆఫీసర్.

భయం



"నాకు చీమలని చూస్తే భయమేస్తుంది డాక్టర్"! అన్నాడు ప్రభు

"అవునా ...అలా ఎప్పటి నుంచి జరగుతోంది..! అడిగాడు ఆశ్చర్యంగా డాక్టర్.

"నాకు షుగర్ వుందని పరీక్షలో తేలినప్పటి నుంచి" అసలు విషయం చెప్పాడు...

సైకిల్



భర్త: నాకు మతిమరుపు అని ఎప్పుడూ తిడుతుంటావు కదా...
చూడు ఈరోజు ఆఫీసుకు పట్టుకెళ్ళిన సైకిల్‌ను మర్చిపోకుండా తీసుకొచ్చాను.

భార్య: అయ్యో...
మీరీవేళ ఆఫీసుకు స్కూటర్‌పైన వెళ్ళారు కదండీ......

ఇంటర్వ్యూ

అధికారి: చూడు మిస్టర్ సుందర్ ...ఇంటర్వ్యూ చేయడంలో మాకు పాతికేళ్ళ అనుభవం ఉంది. నీ ముఖం చూస్తే పాతిక ఏళ్ళలోపే వున్నట్టుంది. నీకో ఛాయిస్ ఇస్తాం.

సుందర్: సార్ ఏంటది?(ఆశగా అడిగాడు)

అధికారి: అతి సులభమైన ప్రశ్నలు యాభై అడగమంటావా? అతి కష్టమైన ఒక ప్రశ్న అడగమంటావా?

సుందర్: సార్ కష్టమైన ఒక ప్రశ్న అడగండి సార్ అదృష్టం పరీక్షించుకుంటాను.

అధికారి: వెరీ గుడ్డు...కోడి ముందా? గుడ్డు ముందా?

సుందర్: గుడ్డే ముందు సార్

అధికారి: వాట్? ఎట్లా? హౌ?

సుందర్: సార్ ఒక ప్రశ్నే అడుగుతామన్నారు కదా సార్.......

ఉప్పు

భర్త: ఈ కూరంతా టూత్‌పేస్ట్ వాసనొస్తోంది ఏంటే!!

భార్య: టీవీలో కాజల్ చెప్పింది కదా టూత్ పేస్ట్‌లో ఉప్పు ఉందని అందుకే కొంచెం వేశాను..!!

మనసుకు గాయం

"నిన్ననే పెళ్ళి చేసుకుని ఇవాళ విడాకులు కావాలని ఎందుకు అడుగుతున్నారు? రాధని అడిగాడు జడ్జి.

"నిన్న రాత్రి ఆయన నా మనస్సుని గాయపరిచే మాట అన్నాడు. ఏంటో అది?

"నాకు వంట చేయడం రాదని..." చెప్పింది.

కళ్ళు మూసుకుని

హరి: కమల్ ఎందుకు కళ్ళు మూసుకుని పాట పాడతారు..?

గిరి: వాడి మనస్సు చాలా మెత్తనిది. తన గొంతు వింటున్న శ్రోతల బాధ చూడలేక అలా కళ్ళు మూసుకుంటాడు.

చాకో చిప్స్ స్టిక్స్

కావలసిన పదార్థాలు

మైదా - 200 గ్రాములు
బేకింగ్ సోడా - 1/2 చెంచా
వెన్న - 4 స్పూన్లు
పంచదార పొడి - 4 స్పూన్లు
చాక్లెట్ పొడి - 2 స్పూన్లు
చాక్లెట్ చిప్స్ - 50 గ్రాములు
పెరుగు - 1/2 కప్పు

తయారు చేసే విధానం

గిన్నెలోకి మైదా, బేకింగ్ సోడా, పంచదార పొడి, చాక్లెట్ పొడి, తీసుకొని వెన్న చేర్చాలి. తర్వాత పెరుగు వేసి బాగా కలపాలి. గట్టిగా ముద్ద చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక గంట తర్వాత పిండిని చిన్న చిన్న ఉండలు చేసి చపాతీ కర్రతో ఒత్తుకోవాలి. దీన్ని నిలువుగా ముక్కలు కోసి పక్కన పెట్టుకోవాలి. వాటిపై చాక్లెట్ చిప్స అద్ది ఓవెన్ ట్రేలో సర్ది ఇరవై నిమిషాలు బేక్ చేయాలి. బయటకు తీసి చల్లారాక తింటే రుచిగా ఉంటాయి.

బ్రెడ్ పకోడి

కావలసిన పదార్థాలు

శనగపిండి - 1 కప్పు
జొన్నపిండి - 1 కప్పు
బఠాణీ పిండి-1/2 కప్పు
మజ్జిగ - 1 కప్పు
బ్రెడ్ - 6 స్లైసులు
ఉల్లి తురుము - 3 పాయలు
మిర్చి, అల్లం పేస్టు - 2 టీ స్పూన్లు
కొత్తిమీర - 1 కట్ట
ఉప్పు - సరిపడినంత
రిఫైండ్ ఆయిల్ - సరిపడినంత

తయారు చేసే విధానం

గిన్నెలో శనగపిండి, జొన్నపిండి, ఉల్లి తురుము, అల్లం, మిర్చి పేస్టు, బఠాణీ పిండి, ఉప్పు వేసి ఈ మిశ్రమాన్ని సరిపడినన్ని నీళ్ళతో జారుగా కలుపుకోవాలి. బ్రెడ్ స్లైసులు చివర్లు కట్ చేసి వాటిని మజ్జిగలో ముంచి 2 నిమిషాల తర్వాత నీటిని పిండేయాలి. బ్రెడ్ ముద్దను చిన్న ముక్కలుగా చేసి శనగపిండి మిశ్రమంలో అద్ది ఆపై ఆయిల్‌లో దోరగా వేయించాలి. వేడిగా వున్నప్పుడే సాస్‌తో కలిపి అతిథులకు అందిస్తే మరింత రుచిగా ఉంటాయి.

పొటాటో చిప్స్

కావలసిన పదార్థాలు

బంగాళ దుంపలు (చెక్కు తీసినవి) - 1/2 కిలో

తయారు చేసే విధానం

బంగాళ దుంపలను శుభ్రంగా కడిగి చెక్కు తీసి సన్న ముక్కలుగా నిలువుగా కోసుకోవాలి. ఆ ముక్కల్ని నీళ్ళలో ఐదు నిమిషాల పాటు నానబెట్టాలి. తరువాత వడకట్టి పొడి బట్టలో వేసి వాటిలో ఉన్న పిండి పోయేవరకు మెత్తగా ఒత్తాలి. ఇలా చేయడం వల్ల ముక్కలు ఒకదానికొకటి అతుక్కోవు. వేయించేప్పుడు పాత్రకి అంటుకుపోవు. బాగా కరకరలాడేలా రావాలంటే ముందుగా ముక్కలను పిండిలో దొర్లించాలి. స్టౌపై బాణలి పెట్టి తగినంత నూనె పోసి ఈ ముక్కలను వేయించుకోవాలి. చిప్స్‌ను త్వరగా తయారు చేసుకోవాలంటే ముక్కలను వేయించే ముందు కాసేపు ఉడికిస్తే సరిపోతుంది.

సగ్గు బియ్యం తాలిపీట్

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం - 1/2 కప్పు
ఉడికించిన ఆలుగడ్డ - 1
పచ్చిమిర్చి - 2, పల్లీల పొడి - 1/2 కప్పు, జీలకర్ర - 1/2 టీ స్పూన్,
ఉప్పు - సరిపడా
నూనె - తగినంత
కొత్తిమీర , పొదీనా తరుగు - 1కప్పు

తయారు చేసే విధానం

ఒక గిన్నెలో సగ్గుబియ్యం వేసి అవి మునిగేలా నీళ్ళు పోసి నానబెట్టాలి. కొత్తిమీర, పుదీనాలు కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ఉడికించిన ఆలుగడ్డను ముద్దగా చేసుకుని అందులో పచ్చిమిర్చి, జీలకర్ర, తరిగి పెట్టుకున్న పొదీనా, కొత్తిమీర తురుము, పల్లీల పొడి, ఉప్పు వేయాలి. ఈ మిశ్రమాన్ని నానిన సగ్గుబియ్యంలో వేసి బాగా కలుపుకోవాలి. స్టౌ మీద నాన్‌స్టిక్ పాన్ పెట్టి వేడిచేయాలి. సగ్గు బియ్యం మిశ్రమాన్ని కావలసిన సైజులో వుండలు చేసుకుని తడి చేత్తో ఆ ముద్దను అప్పంగా వత్తాలి. దీన్ని పాన్‌లో వేసి రెండు స్పూన్లు నూనె వేసి రెండువైపులా గోధుమ రంగు వచ్చేవరకు కాల్చాలి. వీటిని వేడివేడిగా చట్నీతో తింటే రుచిగా వుంటాయి.





బొమ్మ గీద్దామా

ఈ వారం ఆర్టిస్టు అంకుల్ కివి పక్షి బొమ్మను ఎలా గీయాలో నేర్పిస్తాడు. నేర్చుకుంటారు కదూ.



రంగులేద్దామా



తేడాగా ఉందే...



ఈచిత్రంలోని జీవులన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నా ఒకటి మాత్రం తేడాగా ఉంది. దాన్ని గుర్తించండి.

బుజ్జి స్టార్

నేనొక తెలుగు సినిమా హీరోని.. నేనెవరినో చెప్పుకోండి!



ఎక్కడ దాక్కున్నాయో

అడవిలోని జంతువులన్నీ సంతోషంగా ఆడుకుంటున్నాయి. అయితే ఈ చిత్రంలో చాలా వస్తువులు దాగున్నాయి. వాటిని గుర్తించండి.

జవాబులు:
బుజ్జిస్టార్: సూర్య

అతికించండి

చింటు గేదె బొమ్మను కత్తిరించి వాటిని అతికించడం మరిచిపోయాడు. కింద సూచించిన విధంగా అతికించండే.



పదాలు పసిగడదాం

ఇక్కడ మూడు జంతువుల బొమ్మలున్నా...అక్షరాల కుప్పలో చాలానే వున్నాయి. కనిపెట్టి సున్నా చుట్టేయండే.



వేళ్లతో బొమ్మ

ఆర్టిస్ట్ అంకుల్ చేతివేళ్ల నీడతో మనిషి బొమ్మ చేశాడు. చీకటి గదిలో కొవ్వొత్తి వెలిగించి మీరూ ప్రయత్నించండి.

పట్టుకోండి చూద్దాం !

- జీబ్రాలు గుంపులు గుంపులుగా జీవిస్తాయి. ఒక్కో గుంపులో దాదాపు వెయ్యి జీబ్రాలు ఉంటాయి! పిల్ల పుట్టిన తర్వాత దాని దగ్గరకు ఏ ఇతర జీబ్రాలనూ రానివ్వదు తల్లి జీబ్రా. తన స్పర్శ, వాసన, స్వరాన్ని గుర్తుపట్టడం పిల్లకు చేతనైన తర్వాత ఇతర జీబ్రాలతో కలవనిస్తుంది!
- ఇవి గంటకు నలభై కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి. పిల్ల జీబ్రాలయితే పుట్టిన గంటకే పరుగులు మొదలుపెడతాయి. ఇవి నిలబడే నిద్రపోతాయి!
- జీబ్రాలు తమ చెవులను ఎలా కావాలంటే అలా తిప్పగలవు. ఆ కదలికల్ని బట్టే వాటి మూడ్‌ని కనిపెట్టవచ్చని అంటారు జీవ శాస్త్రవేత్తలు!వీటిని పట్టుకోవడం చాలా కష్టం. ఎందుకంటే ఇవి తిన్నగా పరుగెత్తవు. అడ్డదిడ్డంగా పరుగులు తీస్తుంటాయి. అందుకే ఓ పట్టాన దొరకవు. ఒకవేళ ఇక దొరికిపోతానని అనిపిస్తే వెనక కాళ్లను గాల్లోకి లేపి ఒక తన్ను తంతాయి. ఇక అవతల ఎంత భారీ జంతువు ఉన్నా మట్టి కరవాల్సిందే!
- జీబ్రాల ఒంటిమీది చారలు ఇతర జంతువుల్ని చాలా కన్‌ఫ్యూజ్ చేస్తాయి. ఇవి కనుక గుంపుగా ఉన్నాయంటే క్రూరమృగాలు వేటాడలేవు. గుంపులోంచి ఒక్క జంతువుని పట్టుకోలేవు. చారలు వాటి కళ్లను అంతగా మోసం చేస్తాయి. ఏ రెండు జీబ్రాల ఒంటిమీది చారలు ఒకలా ఉండవు!
- గుంపులోని ఒక జీబ్రా మీద ఏదైనా మృగం దాడిచేస్తే మిగతావి పారిపోవు. ప్రాణాలకు తెగించి ఆ మృగంతో పోరాడతాయి. తమ నేస్తాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాయి!
- జీబ్రాలు మహా తెలివైనవి. శత్రువుల్ని భలే మోసం చేస్తుంటాయి. ప్రధాన శత్రువులు సింహాలు, హైనాలకు కలర్ బ్లైండ్‌నెస్ ఉంటుంది. కాబట్టి పచ్చరంగును గుర్తించలేవు. అందుకే ఒంటరిగా ఉండాల్సి వచ్చినప్పుడు జీబ్రాలు పచ్చటి పొదల మాటునో,ఎత్తయిన గడ్డి దుబ్బుల మాటునో ఉంటాయి! వీటి కంటి నిర్మాణం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. రెండు దృశ్యాలను చూడగలవివి!

మహాత్ముడు ... ఆయన సిద్ధాంతాలు

కొత్త పుస్తకాలు

మహాత్ముడు ఆయన సిద్ధాంతాలు, ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్, అనువాదం: కంభంపాటి సత్యనారాయణ, మహీధర రామమోహన్‌రావు, ధర: 90/-, పేజీలు: 130/-, ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. ఫోన్: 0866-2430302.

ఐక్య కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ, కేరళ ముఖ్యమంత్రిగానూ పని చేసిన భారతదేశ ప్రసిద్ధ మార్క్సిస్టు కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ 1958వ సంవత్సరంలో "మహాత్ముడు-ఆయన సిద్ధాంతాలు" అనే పుస్తకాన్ని రాశారు. మహాత్మాగాంధీ ఆశయాలు, సిద్ధాంతాల మీద ప్రస్తుతం బిజెపి, ప్రభుత్వ నాయకత్వంలో తిరిగి చర్చ జరుగుతోంది. గాంధీజీ హత్యకు కారకులైన ఆర్.ఎస్.ఎస్., దాని శిష్యగణమే ఆయన "వారసత్వం" కోసం స్తోత్రపాఠాలు వల్లిస్తున్నారు. తమ తిరోగమనం విషయంలో ఎలాంటి సందేహం లేకుండా ఉండేందుకుగాను పాత తేదీలు, పాత కాలక్రమణ పట్టికలు, పాత శాసనాలు, ప్రాచీన చరిత్ర పరిశోధనా పాండిత్యంలో ఏనాడో మరుగు నపడిన పుక్కిటి పురాణాలను పునర్దర్శనం గావించుకుంటున్నారు. ఆర్.ఎస్.ఎస్ దాని ముద్దు బిడ్డ బి.జె.పి. ఈ ప్రయత్నాలను ఇనుమడించిన ఉత్సాహంతో చేస్తున్నారు. ఆ ప్రయత్నాలను నిరోధించవలసిన ఆవశ్యకత ఉన్నంది. అందుకు నంబూద్రిపాద్ రాసిన "మహాత్ముడు-ఆయన సిద్ధాంతాలు" లాంటి పుస్తకాలను ఎంతగానో ఉపకరిస్తాయి. గాంధీ మహాత్ముని సిద్ధాంతాలను, ఆశయాలను, ఆచరణలను గురించిన అనేక అంశాలను-కామ్రేడ్ నంబూద్రిపాద్ ఈ పుస్తకంలో లేవనెత్తారు. ఆ ప్రశ్నలకు ఆయనిచ్చిన జవాబులు నేటి తరం కమ్యూనిస్టులందరికీ శిరోధార్యం. బ్రిటీషు సామ్రాజ్యవాదానికి అర్జీలు దాఖలా చేసుకుని తన దేశప్రజల్ని విముక్తుల్ని గావించాలనుకున్న మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, విజయమో, వీరస్వర్గమో నినాదాన్ని ఏ విధంగా ఇవ్వ గలిగాడు? "అహింసా" మార్గంలో ప్రజలను కార్యోన్ముఖులను చేసి పాశవికమైన బ్రిటీషు దమనకాండ నెదిరించి కోట్లాదిమంది ప్రజలు పాల్గొనే రీతిలో ఉప్పు, సత్యాగ్రహానికి ఎట్లా నాయకత్వం వహించాడు? ప్రభుభక్తి పరాయణ కుటుంబంలో జన్మించి, ఆ ప్రభువుల్నే ఎదిరించగలిగిన శక్తి ఆయనకెట్లా వచ్చింది? ఉద్యమం తీవ్రరూపం దాల్చినపుడు, తన సన్నిహిత స్నేహితులూ, శిష్యులూ నిరసించి నప్పటికీ ఉద్యమాన్ని ఎందుకు వెనక్కు లాగాడు? బహుళ సంస్కృతుల దేశంలో పుట్టి, ఆ దేశంలోని మతోన్మాదులను తనదైన మార్గంలో వ్యతిరేకించి హిందూ-ముస్లిం ఐక్యత కోసం తన ప్రాణాన్ని ఏవిధంగా వడ్డాడు? కరమ్‌చంద్ గాంధీ "బాపూజీగా, జాతిపితగా" ప్రజల చేత ఏవిధంగా కొనియాడబడ్డాడు? రాజకీయాల్లో ఆయన వారసత్వం ఎవరికి దక్కాలి? వంటి ప్రశ్నలన్నింటికీ నంబూద్రిపాద్ అద్భుతమైన రీతిలో ఈ పుస్తకంలో జవాబులిచ్చాడు. రాజకీయాల్లో ఉన్నవారేగాక, నేటితరం యువకులు సహితం ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. మహాత్ముని సిద్ధాంతాల నుండీ, రాజకీయాల్లో ఆయన కార్యా చరణ నుండీ, ఆయన వ్యక్తిగత జీవనం నుండి నేటి రాజకీయాలు నేర్చుకోవలసినవి ఎన్నో వున్నాయి.

హేలావతి

హేలావతి, తల్లాప్రగడ సూర్యనారాయణరావు పేజీలు: 40/- ధర: 35/- ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్.

'అస్పృశ్యత' భారతదేశంలో సాంఘిక నిరంకుశత్వానికి పరాకాష్ఠ. ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ తల్లాప్రగడ రాసిన నవల 'హేలావతి'. ఈ నవల 1913లో వచ్చింది. ఈ కథ క్రీ.శ.16వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవరాయల కాలంలో జరిగినట్లు రచించారు. మొఘలు చక్రవర్తి బాబరు కొడుకు హుమాయున్. ఈయన 6.3.1508న జన్మించి 30.12.1530న రాజయ్యాడు. 26.1.1556న మరణించాడు. ఈయన రాజకీయ జీవితంలో మిట్టపల్లాలున్నాయి. ఆఫ్ఘన్ సైన్యం చేతిలో ఓడిపోయి, ఆగ్రా వైపు వెళ్ళిపోయాడు. గంగానదిని దాటడం కష్టమైంది. ఈయన అనుచరులు చాలామంది ఆ నదిలో మునిగిపోయారు. హుమాయున్ ఆగ్రా చేరుకున్నా అక్కడ ఉండ లేదు. లాహోర్ వెళ్ళాడు. అక్కడ కూడా ఉండడం సాధ్యంకాక సింధు ప్రాంతానికి వెళ్ళదలచుకున్నాడు. 1540 డిసెంబర్‌లో కుషాబ్ దగ్గర అతని సోదరునితోనే యుద్ధం చేయాల్సి వచ్చింది. వాళ్ళు యుద్ధానికి సన్నద్ధమైన సమయంలో ఒక మహాపురుషుడు హుమాయున్‌ను రక్షించాడు అని డా॥ బి.ఎన్.శాస్త్రిగారు చెప్పారు. (భారతదేశ చరిత్ర: 11వ సంపుట, పు. 108) ఈ చరిత్రను తీసుకొని హుమాయున్‌ను నదిలో రక్షించినది ఒక దళితుడు అని చెప్పారు తల్లాప్రగడ. హిందూ దళితుడైన వీరబలుని కుటుంబం పేదరికంలో తినడానికి తిండి లేక మరణావస్థకు చేరుకుంటుంది. ఆకలిలో అలమటిస్తున్న వీరబలుడు నది దాటలేక ప్రాణాపాయస్థితిలో ఉన్న వీరుని రక్షిస్తాడు. ఆ వీరుడు కృతజ్ఞతతో ఆయన దగ్గరున్న తినుబండారాలు వీరబలునికిస్తాడు. ఆ వీరుడు హుమయూన్ అని వీరబలునికి తర్వాత తెలుస్తుంది. హుమాయున్ బాగా కోలుకొని తిరిగి వెళ్తూ వీరుబలునికి కొంత ఆర్థిక సహాయం చేస్తాడు. ఆ సహాయంతో వీరబలుని కుటుంబం పేదరికం నుండి బయట పడుతుంది. వీరబలుని కూతరు హేలావతి. చిన్నప్పటి నుండి తమ జాతి ప్రజలు అనుభవిస్తున్న అవమానాలను, కష్టాలను చూసింది. అస్పృశ్యత నుండి విముక్తం కావాలంటే తాను దళిత కులంలో పెళ్ళాడకూడదని నిశ్చయించుకొంది. తనను ప్రేమించే దళిత సిద్ధార్థుని ఆమె గౌరవిస్తుందిగాని, అతనిని పెళ్ళాడడానికి ఒప్పుకోదు. పైకులాల వాళ్ళెవరూ ఆమెను పెళ్ళాడడానికి ముందుకు రారు. ఈ నేపథ్యంలో హుమాయున్ మంత్రి కుమారుడు హేలావతిని ప్రేమిస్తాడు. ఆమెను పెళ్ళాడడానికి మతం కట్టుబాట్లు అడ్డం వస్తాయి. గనక ఉంపుడుగత్తెగానైనా ఉంచుకోవాలనుకుంటాడు. హేలావతి అందుకు సమ్మతించదు. మంత్రి కుమారుడు ఆమెను తీసుకుపోయి దాచి పెడతాడు. వీరబలుడు రాజుకు ఫిర్యాదు చేస్తాడు. రాజుకు విషయం అర్థమైంది. వెంటనే వీరబలుని మతం మార్చుకోమంటాడు. వీరబలునికి పెద్ద రాజకీయ పదవినిస్తారు. అప్పుడు హేలావతి మంత్రి కుమారుల పెళ్ళి జరిగింది. హైందవ సమాజంలోని వర్ణ వ్యవస్థ శ్రామిక ప్రజల్ని హీనంగా చూడటంవల్ల ఆ సమాజం ఎంత నష్టపోయిందో రచయిత గుర్తించాడు.

నష్ట నివారణ దృష్టితో ఈ నవల రాశాడు. మత మార్పిడి ఉబుసుపోకకు జరగడంలేదని, అనివార్యంగానే జరుగుతున్నదని గ్రహించిన రచయిత హైందవ సమాజ సంరక్షణ దృష్టితోనే ఈ నవలను రచించాడు.

-స్నేహ







ఇటుక మనుషులు

పార్కులోనో, రోడ్డు మీదో ఇటుకలతో చేసిన మనుషులు కనిపించారంటే ఎవరైనా ఆగిపోవాల్సిందే. అయితే ఆ అదృష్టం అమెరికా వాసులదే. వారు ఎంత తొందరలో వున్నా... ఆగి ... కాసేపయినా వాటిని అలా చూస్తూ నిలబడిపోవాల్సిందే. ఆ ఇటుక శిల్పాల్లో.... గోడలెక్కి ఆడుకునే చిన్నారులు, చదువుకునే పిల్లలు, వాద్య పరికరాలతో వీనుల విందైన సంగీతాన్ని ఆలపిస్తూ మైమరచిపోయే కళాకారులు, చిటారు కొమ్మలందుకొని కాయలు కోసే అల్లరి పిడుగులు, విశ్రాంతిగా పవళించిన జవ్వని, ముద్దుల బిడ్డను చక్రాల బండి సాయంతో షికారు తిప్పే మాతృమూర్తి, సరదాగా సైకిల్ తొక్కే కుర్రాడు ... ఇలా ఎందరో వుంటారు. వీరందరిని సృష్టించింది అమెరికా ఆర్టిస్టు బ్రాడ్ స్పెన్సర్. ఇటుకలతో కళాఖండాలను సృజించే పద్ధతి అత్యంత పురాతనమైనది. కచ్చితంగా చెప్పకోవాలంటే బాబిలోనియా కాలం నాటిది. అందులోనూ బ్రాడ్‌ది ప్రత్యేకమైన శైలి. ముందుగా తను సృజించాలనుకున్న ఆకారానికి తగ్గట్టుగా ఇటుకలను తయారు చేసుకుంటాడు. వాటిని సరైన ఆకారంలో పేర్చాక కాలుస్తాడు. అలా కాల్చిన ఇటుకలను ... ఎంపిక చేసుకున్న ప్రదేశానికి తీసుకెళ్లి సిమెంట్‌తో అబ్బురపరచే ఆకృతులను తయారు చేసేస్తాడు. తన కళాతృష్ణను తీర్చుకోవడానికి మట్టితో చేసిన ఇటుకలనే కాదు! ప్లాస్టర్, సిమెంట్, కంచును ఉపయోగిస్తాడు. ప్రపంచం మొత్తంమీద ఇటుక కళాఖండాలను సృజించే అతి తక్కువ మందిలో ఒకడిగా బ్రాడ్ మంచి పేరు కొట్టేశాడు. •









అనగనగా అమ్మాయి..
చెట్టు తొర్రలో చదువోయి..

ఓ బుజ్జి అమ్మాయి. తనదో అద్భుత ప్రపంచమే అనుకోండి. ఎంచక్కా చెట్టు తొర్రలోకి దూరి చదువుకుంటుంది. బోరు కొడితే చకచకా చెట్టెక్కి ఆడుకొంటుంది. నిద్రొస్తే... ఆ చెట్టు కిందే పల్చగా పరుచుకున్న వెలుతురులో మెత్తటి మంచంమీద నిద్రపోతుంది. ఇవేనా... ఆ వృక్షరాజం మీద మరెన్నో చిరు ప్రాణులు. ఆ చిన్నారిని పలుకరించే పిట్టలు, ఉడికించే ఉడుతలు, వెక్కిరించే కోతులు, భయపెట్టే నక్కలు, అలరించే రంగురంగుల సుమాలు, వాటి మీద వాలిన సీతాకోకచిలుకలు... ముద్దులొలికే పుట్టగొడుగులు... అల్లుకున్న సొగసైన తీగలు... వాహ్... నిజంగానే అదొక అరుదైన ప్రపంచం. కాకపోతే ఇదంతా ఓ పాపాయి పడగ్గదిలో అంటే ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరి అయిపోకుండా వుండలేరెవరైనా. తన ప్రియాతిప్రియమైన కూతురుకు పడగ్గదిలో ఈ ఏర్పాటు చేయడానికి ఆ తండ్రికి 350 గంటల సమయం పట్టింది. ఇనుప తీగలతో చెట్టును తయారుచేసి నిజమైన వృక్షంలా కనికట్టు చేసేందుకు తనలోని సృజనాత్మకతనంతా పరిచి ప్రదర్శించాడు. ●

Check List

Book Number	KNSR07B106	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Sameera	Pages	29